


2 గంటల్లోనే ముంబయికి..
మధురపూడి నుంచి ఎయిర్‌బస్ ప్రారంభం
7

శివయ్యకు జలాభిషేకం



కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో సుందరేశ్వరుడికి గోదావరి జలాలతో సహస్ర ఘటాభిషేకం

కొవ్వూరు,డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) :కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో బాలా త్రిపు సుందరీ సమేత సుందరేశ్వర స్వామికి సహస్ర ఘటాభిషేకం నిర్వహించారు. గోష్పాదక్షేత్ర లక్ష పత్రి, లక్షకుంకుమ పూజా కమిటీ 62వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం ఉదయం గోదావరి జలాలతో సుందరేశ్వర స్వామికి సహస్ర ఘటాభిషేకం నిర్వహించారు.అనంతరం శ్రీ బాలాత్రిపుర సుందరీ సమేత సుందరేశ్వరస్వామి ఉత్సవ మూర్తులను పల్లకీపై పురవీధు ల్లో ఊరేగించారు. సుందరేశ్వర స్వామికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, లక్ష బిల్వార్చన, బాలాత్రిపుర సుందరీదేవి అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. వేదపండితులచే వేద పారాయణ, దేవతామూర్తులను విశేష అలంకరణ చేసి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో కొవ్వూరు పట్టణ పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

ఎయిడ్స్ బాధితులపై వివక్ష వద్దు

రాజమహేంద్రవరం అర్బన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఎయిడ్స్ బాధితుల పట్ల సమాజంలో వివక్షతకు తావులేదని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. ఎయిడ్స్ డే సందర్భంగా ఆదివారం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో బాధితులో కలిసి కలెక్టర్, ఇతర అధికారులు సహపంక్తి భోజనం చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఎయిడ్స్ బాధితుల పట్ల సమాజంలో వివక్షతకు వ్యతిరేకంగా చైతన్యం తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. ఎయిడ్స్ వ్యాధిబారిన పడకుండా యువతలో చైతన్యం తీసుకురావాల్సి ఉందన్నారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.ప్రకాష్‌బాబు మాట్లాడుతూ సుప్రీం కోర్టు ఆదేశాల ప్రకారం నల్సా చట్టానికి అనుగుణంగా రాజ్యాంగం కల్పించిన హక్కులపై అందరికీ సమాన హక్కు ఉందని స్పష్టం చేశారు. ఎయిడ్స్ బాధితుల గుర్తింపును బహిర్గం చేయకూడదన్నారు.కార్యక్రమంలో సమన్వయశాఖల అధికారులు,వైద్యులు,స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



ఎయిడ్స్ బాధిత చిన్నారులతో కలిసి సహపంక్తి భోజనం చేస్తున్న కలెక్టర్, అధికారులు



అగస్త్యేశ్వరుడికి అన్నాభిషేకం

ధవళేశ్వరం,డిసెంబరు1(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం ముగింపును పురస్కరించుకుని ఆదివారం బాలా త్రిపుర సుందరి సమేత అగస్త్యేశ్వర స్వామి వారికి మహా అన్నాభిషేకం నిర్వహించారు. ఉదయం విశేష అభిషేకాలు,అర్చనలు అనంతరం ఆలయప్రాంగణంలో వండివార్చిన అన్నాన్ని ఆలయ అర్చకులు విశ్వనాథ శర్మ,చిన్నశర్మలు స్వామివారికి అభిషేకించారు. స్వామివారిని భక్తులు దర్శించుకున్నారు.అనంతరం అభిషేకించిన అన్నప్రసాదాన్ని భక్తులు స్వీకరించారు.ఏర్పాట్లను గ్రామ సభాపతి మంగళంపల్లి చంద్రశేఖర్ శాస్త్రి, నిర్వాహకకమిటీ సభ్యులు కొత్యల సుబ్బారాయుడు, యడ్ల వెంకటేష్, ఆలయ సిబ్బంది పర్యవేక్షించారు.



కరుణించు..కోటసత్తెమ్మ

నిడదవోలు,డిసెంబరు 01 (ఆంధ్రజ్యోతి) : కోటసత్తెమ్మ నీకు కోటి దండాలు అంటూ భక్తులు అమ్మవారి దర్శనానికి క్యూ కట్టారు. నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెం గ్రామంలో ఆదివారం కోటసత్తెమ్మను భక్తులు పెద్ద ఎత్తున దర్శించుకున్నారు. అమ్మవారికి ఉదయం సుప్రభాత సేవతో ప్రారంభమై ధూపహారతి, నిత్యార్చన, లలితా పారాయణం, సహస్రనామ కుంకుమ పూజలు చేశారు. అనంతరం అమ్మవారికి క్షీర నివేదన, మహానివేదన చేశారు. అనంతరం ప్రత్యేక పూల అలంకరణలో ఉన్న అమ్మవారిని భక్తులు దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

నేడు పీజీఆర్ఎస్

రాజమహేంద్రవరం రూరల్, డిసెంబర్ (ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కారవేదిక మీకోసం (పీజీఆర్ఎస్) సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరుగుతుందని కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంతో పాటు కొవ్వూరు,రాజమహేంద్రవరం డివిజన్‌ల పరిధిలో నిర్వ హిస్తారన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఉన్నతాధికారులు ప్రభుత్వాసుపత్రుల్లో ప్రసవాలు పెరగాలని ఆదేశాలిస్తుంటారు.. అయితే ఒక ప్రభుత్వ ఉద్యోగి ప్రసవానికి ప్రభుత్వాసుపత్రికి వెళితే తల్లిని క్షేమంగా ఇంటికి పంపలేకపోయారు. అయినా చర్యల్లేవ్.. రాజవొమ్మంగి మండలం కొండపల్లికి చెందిన చీరబోయిన వెంకటలక్ష్మి(34) అటవీశాఖలో గోకవరం రాణాదారుగా పనిచేస్తున్నారు. ఈ నెల 22న రాత్రి ప్రసవానికి గోకవరం ప్రభుత్వాస్పత్రికి వచ్చారు. శస్త్ర చికిత్స చేస్తుండగా మగబిడ్డకు జన్మనిచ్చి ఆమె కన్నుమూశారు. ఆమె గర్భవతిగా నిర్ధారణ అయిన నాటి నుంచీ రాజమహేంద్రవరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో పరీక్షలు చేయించుకున్నారు. అయితే ప్రసవానికి మాత్రం గోకవరం ప్రభుత్వాసుపత్రిలో చేరారు. పండంటి మగబిడ్డకు జన్మనిచ్చిన వెంకటలక్ష్మి ప్రసవ సమయంలో మృతిచెందడంపై వైద్యులు ఆశువుగా కారణాలు చెప్పేశారు. కానీ కళ్లు కూడా తెరవకముందే తన తల్లి శాశ్వతంగా కళ్లు మూయడంపై ఆ నవజాత పసోడికి ఎవరు సమాధానం చెబుతారు..?

గత నెలలో రాజమండ్రి రూరల్ మండలం రాజవోలు గ్రామానికి చెందిన కేతనకు ఏడో నెలలో ప్రసవ వేదన రావడంతో గోరక్షణపేట సమీపంలో కొత్తగా నిర్మించిన ఓ కార్పొరేట్ స్థాయి పిల్లల ఆస్పత్రిలో చేర్పించారు..అయితే మగబిడ్డ జన్మించాడు. ఆస్పత్రిలో ఉంచి చికిత్స అందించాలని వైద్యులు సూచించారు. దఫదఫాలుగా రూ.25 లక్షల వరకూ బిల్లు వేశారు. సుమారు రెండు నెలల పాటు చికిత్స సమయంలో తల్లిని మినహా చివరికి తండ్రి రమణను కూడా బిడ్డను చూడనివ్వలేదు. ఈ నెల 23 తెల్లవారుజామున 4గంటలకు నవజాత శిశువు మృతి చెందిందని వైద్యులు చెప్పడంలో ఆ కుటుంబం ఘొల్లుమంది. అప్పటికి సమర్పించినవి కాకుండా మరో రూ.3 లక్షలు చెల్లించి బిడ్డను తీసుకెళ్లాలని చెప్పడంతో బాధితులు హతాశులయ్యారు. ఆస్పత్రి వైద్యుల నిర్లక్ష్యం వల్లే తాము తీరని శోకంలో మునిగిపోయామంటూ బిడ్డ తల్లిదండ్రులు కలెక్టర్‌కి ఫిర్యాదు చేసే ఆలోచనలో ఉన్నారు.

జిల్లా పంచాయతీ అధికారి బొబ్బరాడ శ్రీనివాసరావు మరణం విషయంలో ఓ కార్పొరేట్ ఆస్పత్రి తీరుపై పెద్ద దుమారమే రేగుతోంది.ఆయన కుమార్తె, కొందరు గెజిటెడ్ అధికారులు ఏకంగా కలెక్టర్‌కి ఫిర్యాదు చేశారు. అక్టోబరు 16న రాత్రి మా నాన్నకు గుండెలో అసౌకర్యం ప్రారంభమైంది. వెంటనే రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా తీవ్రమైన పక్షవాతం వచ్చినట్టుగా ఈసీజీ ద్వారా నిర్ధారించి అత్యవసర వైద్యం అందించారు. ఆ వైద్యుల సూచనతో 17న తెల్లవారుజామున 2 గంటల ప్రాంతంలో డెల్టా ఆసుపత్రికి తీసుకెళ్లాం. అక్కడ తీవ్రమైన నిర్లక్ష్యం ప్రదర్శించారు. ఇది మా నాన్న మృతికి దారి తీసింది. అని జిల్లా పంచాయతీ అధికారి కుమార్తె కలెక్టర్‌కి చేసిన ఫిర్యాదులో ఉంది.దీనిపై కలెక్టర్ విచారణకు ఆదేశించారు..ఆ విచారణ తూతూ మంత్రంగా సాగినట్టు తెలిసింది. తమ తోటి అధికారి వైద్యుల నిర్లక్ష్యం కారణంగా చనిపోయారని ఫిర్యాదు చేసినా విచారణ జరిగిన తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఆసుపత్రులా.. అంపశయ్యలా!?



గోకవరం ఆసుపత్రి వద్ద అంబులెన్స్ ఎక్కిస్తున్న వెంకటలక్ష్మి మృతదేహం(ఫైల్)

- జిల్లాలో పెరిగిన మరణాల రేటు
- ప్రైవేటు ఆసుపత్రికి వెళితే బాదుడే
- ఇష్టానుసారంగా ఫీజులు
- లక్షలుంటేనే చికిత్స..లేదంటే అంతే
- ప్రాణాలు కోల్పోతున్న సామాన్యులు
- ప్రభుత్వాసుపత్రిలో 1200 మంది
- ప్రైవేటు ఆసుపత్రుల్లో 690 మంది
- ఇదీ 11 నెలల్లో మృతుల సంఖ్య
- పెరుగుతున్న వైద్యుల నిర్లక్ష్యం
- కొరవడిన అధికారుల పర్యవేక్షణ

వైద్యో..నారాయణో హరి..హరీ!

వైద్యో నారాయణో హరి.. అంటే వైద్యుడిని దేవుడిగా చూస్తాం.. ప్రస్తుతం వైద్యుల తీరు చూస్తుంటే హరి హరీ అనేలా ఉంది.. డబ్బులుంటేనే జబ్బు తగ్గుతుంది.. లేదంటే అంతే.. ఆసుపత్రులు అంపశయ్యల్లా మారాయి. రెండు నెలల బిడ్డకు రూ.7 లక్షల మందులు వాడినట్టు చెప్పి.. రూ. 25 లక్షల బిల్లు వేశారంటే కార్పొరేట్ ఆసుపత్రుల బాదుడు ఎంతలా ఉందో అర్థం చేసు కోవచ్చు.. అయినా బిడ్డను కాపాడగలిగారా అంటే అదీలేదు.. అధికారుల పర్యవేక్షణ కొరవడడం.. ప్రైవేటు ఆసుపత్రుల్లో ఫీజులపై నియంత్రణ లేకపోవడంతో ఇష్టాను సారంగా పిండేస్తున్నారు.. ఎమర్జెన్సీ ఆసుపత్రుల పేరిట వైద్యులు గ్రూపులుగా మారి లాగేస్తున్నారు. జిల్లా పంచాయతీ అధికారి వైద్యుల నిర్లక్ష్యం కారణంగా చనిపోయారంటూ కుటుంబీకులు ఘొల్లుమంటుంటే కనీస చర్యల్లేవ్.. ఇక సామాన్యుడు చూస్తూ ఉండడం తప్ప ఏం చేస్తాడు.. పోనీ అధికారం ఉన్నవారు ఏమైనా చేస్తున్నారా అంటే అదీలేదు.

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

భగవంతుడిని ఎంత నమ్మినా ఆరోగ్య విపత్కర సమయంలో 'వైద్యో నారాయణో హరిః' అంటూ వైద్యుడినే కొలుస్తాం. సాక్షాత్తూ భగవత్ రూపంగా చూస్తాం. కానీ ఇవాళ వైద్యంలో తరిగిపోతున్న విలువలు,వైద్యాలయాల కాసుల కక్కుర్తి వెరసి ప్రాణాలు గాలిలో దీపాలను తలపిస్తున్నాయి. కాపాడాల్సిన చేతులే కాటికి పంపేస్తున్నాయి. పోయేది ఒక ప్రాణమే అయినా.. ఆ ప్రాణంతో ముడిపడి ఉన్న ఎన్నో ప్రాణాలు జీవచ్ఛవాలు అయిపోతున్నాయి. అప్పుడే పుట్టిన బిడ్డకు రెండు నెలలకు ఏకంగా రూ.7లక్షల మందులు వాడేసినట్టు ఇటీవల ఓ కార్పొరేటు ఆస్పత్రి బిల్లు వేసిందంటే యంత్రాంగం ఎంత కళ్లు మూసుకుందో అర్థం చేసుకోవచ్చు. వైద్యం వికటిస్తుండడంపై బాధితులు ఏకంగా జిల్లా బాస్ అయిన కలెక్టర్‌ని ఆశ్రయిస్తుండడం తీవ్రతకు అద్దం పడుతోంది. కేవలం 11 నెలల్లో జిల్లా కేంద్రంలోని ప్రైవేటు/కార్పొరేటు, ప్రభుత్వాస్పత్రుల నుంచి 2 వేల మందిని కాటికి పంపారనే నిజం కలచివేస్తోంది. బాధితులు ఆస్పత్రి సిబ్బందిని గట్టిగా నిలదీస్తే జైలుకు వెళతారనే బోర్డులు ఉంటున్నాయే గానీ ఆస్పత్రి విధులు, బాధ్యతలపై ఎక్కడా ఒక్క అక్షరం కూడా కనబడదు. మరోవైపు అధికారులు హెచ్చరికలకే పరిమితం అవుతున్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలోని ఆస్పత్రుల తీరుపై 'ఆంధ్రజ్యోతి' పరిశోధనాత్మక కథనం.

తక్షణమే కాయకల్ప చేయాల్సిందే!

జిల్లాలో పదుల్లో కార్పొరేట్, వందల్లో ప్రైవేటు ఆస్పత్రులు, ల్యాబొరేటరీలు, చిన్నపాటి క్లినిక్‌లు ఉన్నాయి. వీటిలో అధికశాతం జిల్లా కేంద్రమైన రాజమహేంద్రవరంలోనే ఉన్నాయి. ఇక్కడి ప్రభుత్వాస్పత్రికి ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల నుంచీ వైద్యానికి వస్తుంటారు. కార్పొరేట్/ప్రైవేటు ఆస్పత్రులు కాసుల కక్కుర్తిలో పడిపోయి వైద్యానికి తిలోదకాలు ఇస్తుంటే.. ప్రభుత్వాస్పత్రుల్లో పరికరాల కొరత, సమయానికి ఆయా డాక్టర్లు అందుబాటులో లేకపోవడం ప్రాణాలను తీస్తోంది. మెడికల్ కళాశాల స్థాయికి జిల్లా సమగ్ర ఆస్పత్రి అభివృద్ధి చెందినా ఇప్పటికీ రోగులను సంబంధీకులే మోసుకెళ్లి మంచంపై వేసే దుస్థితిని రోజూ చూడొచ్చు. ఇక ప్రైవేటు/కార్పొరేటు ఆస్పత్రుల గురించి ఎంత తక్కువ చెప్పుకుంటే అంత మంచిది.అన్నీ అలాగే లేకపోయినా.. అధిక శాతం ఆస్పత్రులు రోగుల్లో డబ్బును చూస్తున్నాయి.మా దగ్గరకు వందలాది మంది రోగులు వస్తుంటారు..ఆ మాత్రం ప్రాణాలు పోవడం పెద్ద తప్పేమీ కాదని ఓ కార్పొరేట్ ఆస్పత్రి వర్గాలు మాట్లాడడం విని వైద్య విలువలు తల దించుకుంటున్నాయి. చివరికి గోల్డెన్ అవర్‌లో చికిత్సపై కూడా తీవ్ర నిర్లక్ష్యం కనబడుతోందనే ఆరోపణలు ఉన్నాయి. గుండె నొప్పి వస్తే బీపీ నిపుణుడితో వైద్యం చేయించే ఘనులూ ఉన్నారు. ప్రైవేటు ఆస్పత్రులకు అత్యవసర సమయంలో రోగిని తీసుకెళ్తుంటే.. వారి బంధువులు ఆస్పత్రుల చేతుల్లో లక్షలు పెట్టడం కోసం బయట అప్పులకు తిరుగుతున్న దయనీయ సందర్భాలు కానవస్తున్నాయి. వైద్య యంత్రాంగానికి తక్షణ కాయకల్ప చికిత్స అవసరమని ఈ పరిస్థితులు చెబుతున్నాయి.ఏ ఘటన జరిగినా నాటకీయ విచారణలు జరపడం, ఆ నివేదికలు బయటకు రాకపోవడం,ఎవరిపైనా చర్యలు తీసుకున్న దాఖలాలు లేకపోవడం చూస్తూ విస్తుపోతున్నాయి. జిల్లాలోని ప్రభుత్వ ప్రైవేటు/కార్పొరేట్ ఆస్పత్రుల్లో మరణాలపై ప్రభుత్వం విచార ణకు ఉపక్రమించాలని బాధిత కుటుంబాలు కోరుతున్నాయి.

ప్రభుత్వాసుపత్రికెళితే..

నిత్యం జిల్లా సమగ్ర ఆస్పత్రికి ఓపీ 900-1200, ఇన్‌పేషెంట్ల సంఖ్య 80-100 వరకూ ఉంటోంది. రోజుకు కనిష్ఠంగా ఇద్దరు, గరిష్ఠంగా ఐదుగురు.. నెలకు సరాసరిన 100 మంది చనిపోతున్నారు. ఎక్కువగా పక్షవాతం, శ్వాస, ఊపిరి తిత్తులు, లివర్ సమస్యలు, ఆకస్మికంగా గుండె పనితీరు మందగించడం, రోడ్డు ప్రమాదాల కేసుల్లో ఎక్కువగా మరణాలు సంభవిస్తున్నాయి. ఈ ఆస్పత్రి బోధనాస్పత్రి స్థాయికి చేరుకున్నా చిత్రమైన పరిస్థితులు వెంటాడుతూనే ఉన్నాయి. వైద్యులు ఉన్నా పరికరాల కొరత వేధిస్తోంది.ఈ ఆస్పత్రికి ఎక్కువగా ప్రమాదాల కేసులు వస్తుంటాయి. నరాలు, మెదడు సంబంధిత వైద్యుల అవసరత ఉంటుంది. అయితే ముగ్గురు న్యూరో సర్జన్లు ఉన్నా ఎక్విప్‌మెంట్ లేకపోవడంతో చికిత్స అందించలేకపోతున్నారు. ఈ నేపథ్యంలో అత్యవసరమైనా కాకినాడ రిఫర్ చేస్తున్నారు. వీరిలో అధిక శాతం మంది దారి మధ్యలోనే చనిపోతున్నారు. సుమారు రూ.కోటి ఖర్చయ్యే ఈ పరికరాలు/యంత్రాల కోసం ప్రైవేటు సంస్థలను అభ్యర్థిస్తున్నారు.అత్య వసర వైద్య విభాగాన్ని ఒక అసి స్టెంట్ ప్రొఫె సర్‌తో నెట్టుకొస్తున్నారు. ప్రైవేటు ఆస్పత్రుల వైకల్యాలను పట్టించుకునే నాథుడే కానరావడం లేదు. ధరల పట్టికలు ఉండవు. మందుల్లోనూ మతలబు చేస్తుంటారు.నవజాత శిశువును వైద్యం పేరిట రెండు నెలలు ఉంచిన ఒక ప్రైవేటు ఆస్పత్రి సర్వీసు పేరుతో రూ.94 వేలు, ప్యాకేజీ అంటూ రూ.2.5 లక్షలు, వైద్యుల కన్సల్టెన్సీ రూ.65 వేలు,మందులకు ఏకంగా రూ.7 లక్షలు ఇతర ఖర్చులు వెరసి రూ.25 లక్షలు లాగేశారు. ఇంతా చేసి నిర్జీవ బిడ్డను చేతిలో పెట్టారు. ఇది ఒక్క ఉదాహరణ మాత్రమే.

11 నెలలు.. 2 వేల మంది..

ప్రైవేటు/కార్పొరేటు ఆస్పత్రుల్లో ఈ జనవరి నుంచి నవంబరు వరకూ సంభవించిన మరణాల గణాంకాలను చూస్తే.. కిమ్స్ 189, డెల్టా 66, సాయి 35, జీఎస్ఎల్ ట్రస్ట్ 39, స్వతంత్ర 35, అభయ 8, అపెక్స్ 14, ఫస్ట్ ప్లస్ 35, సన్‌స్టార్ 17, సురక్షా 20, కిపీ 8, మాగ్నా 9, తేలత్ 11, విజన్ 47, కమలాకర్ 12, రాజు న్యూరో 39, శ్రీ ఆదిత్య 12, సిద్ధార్థ 8, స్మార్ట్ 15, నవీన్, సిద్ధార్థ చిల్డ్రన్, శ్రీ సాయి దుర్గా, అన్నపూర్ణ, హెల్త్, హీలియోస్, జూపి టర్, నెస్ట్, శ్రీ రవి, శ్రీ సాగర్, సెయింట్ జోసెఫ్, చక్రధర్, నీఆజీయర్, బ్లాసమ్స్ సాయి, మాధవి,రాజాలో ఒక్కరు చొప్పున, కిపీ, ఆరోగ్య, ఏఆర్‌కే, భాస్కరరాజు, గాంధీ, జయత్రి, నవీన్, సహజ ఆస్పత్రులో ఇద్దరేసి, రాజు న్యూరో, ప్రైమ్, ఆర్ఎస్ న్యూరో, వాసవి శ్రీ, సౌభాగ్యవరుణ్‌లో ముగ్గురు చొప్పున, మహాలో నలుగురు, స్వామి వైద్యాలయ, రవి చైతన్యవిజయ్ ఆస్పత్రిలో ఐదుగురు చొప్పున ప్రాణాలు కోల్పోయారు.మొత్తంగా 11 నెలల్లో ప్రభుత్వాస్పత్రిలో 1200 మంది, ప్రైవేటు ఆస్పత్రుల్లో 690 మంది చనిపోయారు. ఇలా ఆసుపత్రులు అంపశయ్యల్లా మారాయి.

వీడని ముసురు

- మారిన వాతావరణం
- కళ్లాల్లో 2103 మెట్రిక్ టన్నులు
- అన్నదాతల్లో ఆందోళన
- నేడు తరలించేందుకు చర్యలు
- చేలల్లోనే 35 శాతం పంట
- జిల్లా వ్యాప్తంగా పెరిగిన చలి

రాజమహేంద్రవరం/గోపాలపురం,డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి) : ముసురు వీడలేదు. అన్నదాతల్లో ఆందోళన ఆగలేదు.. ఆకాశంలో మార్పులు ధాన్యం రైతులకు రెండో రోజు కంటి మీద కునుకులేకుండా చేశాయి.గత రెండు రోజులుగా తుఫాన్ ప్రకటనలు రైతుల గుండెల మీద కుంపటిలా తయారయ్యాయి. రేయింబవళ్లు కష్టించి పండించిన పంట చేతికొచ్చే సమయంలో అటు పొగాకు, ఇటు ధాన్యం రైతులు ఆందోళన చెందుతున్నారు. తుఫాన్లతో ఇప్పటికే కోసిన పంట రోడ్లపై టార్పాలిన్లు కప్పిన రైతులు ఏ సమయంలో ఎటు నుంచి ప్రమాదం ముంచుకొస్తుందోనని కంటి మీద కునుకులేకుండా క్షణక్షణం భయంభయంగా గడుపుతున్నారు. పొగాకు రైతులు కారుమబ్బుల కారణంగా మొక్కలకు చీడపీడలు ఆశిస్తాయనే భయంతో దిగాలుగా చూస్తున్నారు.ఆదివారం ఉదయం నుంచి ఆకాశం మబ్బుగా ఉంది.. దీంతో రైతులు కోతలకు ధైర్యం చేయలేదు.జిల్లాలో ఇంకా 35 శాతం వరికోతలు జరగాల్సి ఉంది. అధికారుల సూచనల మేరకు నిలిపివేశారు. కళ్లాలో ఉన్న ధాన్యాన్ని మిల్లులకు తరలించే పనిలో రైతులు,అధికారులు నిమగ్నమయ్యారు. శనివారం నాటికి కళ్లాల్లో 30 వేల మెట్రిక్ టన్నులు ఉంటే ఆదివారం నాటికి ఈ సంఖ్యను 2103 మెట్రిక్ టన్నులకు తగ్గించారు. సోమవారం నాటికి మొత్తం ధాన్యం మిల్లులకు తరలించే ప్రయత్నం చేస్తున్నట్టు జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు తెలిపారు. 410 మెట్రిక్ టన్నుల వరి పంట కుప్పల రూపంలో ఉందన్నారు. జిల్లాలో కోరుకొండ మండలంలో 80 మెట్రిక్ టన్నులు,గోకవరంలో 503, సీతాన గరంలో 350, దేవరపల్లిలో 100, గోపాలపురంలో 230, కొవ్వూరులో 50, నిడదవోలులో 85, పెర వలిలో 150, తాళ్లపూడిలో 400, ఉండ్రాజవరంలో 100, నల్లజర్లలో 55 మెట్రిక్ టన్నుల ధాన్యం కళ్లా ల్లో ఉంది. ధాన్యాన్ని సోమవారం మిల్లులకు తరలిస్తామని అధికారులు చెబుతున్నారు.



గోపాలపురం: బస్తాల్లోకి ఎత్తి ధాన్యం తరలింపు

పెరిగిన చలి తీవ్రత

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో రాజమహేంద్రవరం జిల్లావ్యాప్తంగా వర్షం కురిసింది. ఆదివారం తెల్లవారుజాము నుంచి రాజమహేంద్రవరం, రూ రల్,రాజానగరం, కోరుకొండ, సీతానగరం ప్రాం తాల్లో జల్లులతో కూడిన వర్షం కురిసింది. ఆది వారం ఉదయం నుంచి కొన్ని ప్రాంతాల్లో తుంపర్లగా వాన కురిసింది. మధ్యాహ్నం నుంచి జల్లులుగా పడింది. శీతాకాలం కావడంతో చలి తీవ్రతకు వాన తోడుకావడంతో వాతావరణం పూర్తిగా చల్లబడిపోయింది. రాజమహేంద్రవరంలో ఆదివా రం ఉష్ణోగ్రత 24 డిగ్రీలుగా నమోదైంది.



వెరీ..గుడ్!

కార్తీకమాసమైనా ఎక్కడా గుడ్డు ధర దిగిరాలేదు.. పెరుగుతూనే ఉంది.. డిమాండ్‌కు తగినట్టు ఉత్పత్తి లేకపోవడంతో అంతకంతకూ పెరుగుతూనే ఉంది.. గతంలో ఉభయగోదావరి జిల్లాలు పౌల్ట్రీ పరిశ్రమకు పెట్టింది పేరు.. రాను రాను నష్టాలు రావడంతో కోళ్లను తగ్గించుకుంటూ వచ్చారు.. దీంతో ప్రస్తుతం ఉత్పత్తి పడిపోయి ధర పెరుగుతోంది. ఒక్కో గుడ్డు పౌల్ట్రీ వద్ద రూ.6.08 పైసలు పలుకుతోంది. -7లో



వైసీపీ ప్రభుత్వంలో మట్టి తరలించిన పోలవరం గట్టు వద్ద సర్పంచ్ గద్దే తిలక్ వర్గీయుల ఆందోళన

పోలవరం కుడి కాల్వ గట్టు గుల్ల

నాడు వైసీపీ నాయకుల తీరుపై శింగరాజుపాలెంలో సర్పంచ్ నిరసన

నల్లజర్ల, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ ప్రభుత్వంలోనే పోలవరం కుడి కాల్వ గట్టును వైసీపీ నాయకులు కొల్లగొట్టారని శింగరాజుపాలెం జనసేన సర్పంచ్ గద్దె బాలగంగధర్ తిలక్ అన్నారు. నల్లజర్ల మండలం శింగరాజుపాలెంలో వైసీపీ ప్రభుత్వంలో 10 ఎకరాల పోలవరం కుడి కాల్వ గట్టును త్రవ్విన ప్రదేశంలో ఆదివారం జనసేన నాయకులు,కార్యకర్తలు ఆందోళన చేశారు.శింగరాజుపాలెం గ్రామానికి చెందిన ఒక వ్యక్తి నకిలీ పర్మిట్ చూపిస్తూ పోలవరం కుడి కాల్వ గట్టు మట్టిని గుండుగొలను-కొవ్వూరు హైవే అధికారులకు విక్రయించారని ఆరోపించారు. అనంతపల్లి నుంచి శింగరాజుపాలెం వరకు పోలవరం కుడి కాల్వ గట్టును నేల మట్టం చేసి అందులో వ్యవసాయం చేస్తున్నారని ఆరోపించారు.విజిలెన్స్ అధికారులు పోలవరం కుడి కాల్వ గట్టును సర్వే చేసి వైసీపీ నాయకులు తరలించిన మట్టిని గుర్తించి పోలవరం కుడి కాల్వ గట్టును పటిష్ఠం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన అధ్యక్షులు దొండపాటి బాబు, కేశవరావు, అనపర్తి ముసలయ్య,గారపాటి వెంకటేశ్వరరావు, అలం మహేశ్,అనిల్ పాల్గొన్నారు.

వెరీ..గుడ్డు



కోడి గుడ్డు అధరహో

ఫారం వద్ద గుడ్డు రూ.6.08 పైసలు

రిటైల్‌గా రూ.7లకు విక్రయం

అనపర్తి/సామర్లకోట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): దాణా రేట్లు, నిర్వహణా ఖర్చులు గణనీయంగా పెరగడంతో రెండేళ్లుగా కోళ్ల పరిశ్రమ నష్టాల్లో నడిచింది. ప్రస్తుతం గుడ్డు ధర రూ.6.08 పైసలకు పెరగడంతో రైతులు కొంత మేర ఊపిరి పీల్చుకుంటున్నారు. 15 నుంచి 20 రోజులుగా ఈ ధర అటు ఇటుగా ఉన్నప్పటికీ రైతుకు కొంత మేర ప్రయోజనం చేకూరుతోంది. గోదావరి జిల్లాల్లో పెద్ద చిన్న ఫారాలు సుమారుగా 300నుంచి 350 వరకు ఉన్నాయి. వీటిలో సుమారుగా 1.5 కోట్ల కోళ్లు ఉన్నాయి. వీటి ద్వారా రోజుకు సుమారు 1 కోటి వరకు ఉత్పత్తి అవుతుండగా వీటిలో 40 శాతం వరకు స్థానిక అవసరాలకు వినియోగిస్తుండగా మిగిలిన వాటిని విదేశాలకు ఎగుమతి చేస్తున్నారు. నెక్ ధర రూ.6.08పైసలు ఉన్నప్పటికీ ట్రేడర్లు మాత్రం ఈ ధరకు రూ.0.25 పైసలు తగ్గించి కొంటున్నారు. మరో 2శాతం కమిషన్ రూపంలో పోవడంతో రైతుకు 5.80పైసలు మాత్రమే అందుతుంది. అయితే పేపర్ రేటు ఎక్కువగా ఉండడంతో రిటైల్ మార్కెట్‌లో వినియోగదారుడు మాత్రం రూ.7 వెచ్చించి గుడ్డును కొనుగోలు చేస్తున్నాడు. అయితే దేశం మొత్తం పంజాబ్ మార్కెట్‌పై ఆధారపడి ఉంటుందని, అక్కడ ధర ఉన్నంత వరకే ఇక్కడ ధర ఉంటుందని, ఎన్ని రోజుల పాటు ఈ ధర నిలబడుతుంతో చెప్పలేమని రైతులు చెబుతున్నారు. రెండు మూడేళ్లలో బ్యాచ్‌ల సంఖ్య గణనీయంగా తగ్గించడంతో ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో ఉత్పత్తి కూడా తగ్గు ముఖం పట్టింది. గుడ్డు తయారీకి సుమారుగా రూ.5 వరకు ఖర్చు అవుతుందని, అయితే ఏడాదిలో కనీసం రెండు మూడు నెలలు కూడా గిట్టుబాటు ధర ఉండడం లేదని, మిగిలిని తొమ్మిది మాసాల్లో నష్టాలు చవి చూస్తున్నామని రైతులు అంటున్నారు. దీనికి తోడు నూకలు, మొక్కజొన్నలు దొరడంలేదని, దొరికినా కొనలేని స్థితిలో ఉన్నామని వాపోతున్నారు. గతంలో టీడీపీ అధికారంలో ఉండగా రైతులకు అనేక రాయితీలు అందేవని, ఐదేళ్లుగా వైసీపీ పాలనలో ఒక్క రాయితీ కూడా లేకుండా చేశారని, ప్రస్తుతం కూటమి ప్రభుత్వం కనీసం నూకలు, మొక్కజొన్న రాయితీ ధరకు అందిస్తే పరిశ్రమ మనుగడ సాగిస్తుందని రైతులు కోరుతున్నారు.

సత్యదేవుడి వ్రతాలు 1,47,122

● ఆల్ టైమ్ రికార్డు ● ముగిసిన కార్తీక సందడి ● నేడు హుండీల లెక్కింపు ● రూ.20 కోట్లు ఆదాయం వస్తుందని అంచనా



ఆలయంలో వ్రతాలు ఆచరిస్తున్న భక్తులు

అన్నవరం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): హరిహరులకు ప్రీతికరమైన పవిత్ర కార్తీకమాసం సందడి హరిహర క్షేత్రమైన సత్యదేవుడి ఆలయంలో ఆదివారంతో ముగిసింది. కార్తీకమాసం నెలరోజుల్లో ప్రతీఏటా 15 రోజులు పర్వదినాలు మిగిలిన 15రోజులు సాధారణ రోజులుగా ఉండేవి. ఈ ఏడాది మాత్రం కార్తీకమాసం ప్రారంభం నుంచి రద్దీ నాలుగైదు రోజులు మినహా ఒకే విధంగా సాగింది. దీంతో మునుపెన్నడూ లేని విధంగా వ్రతాల సంఖ్య ఆల్ టైం రికార్డు నెలకొల్పి 1,47,122 వ్రతాలు జరిగాయి. వీటిలో రూ.300 వ్రతాలు 1,6,901, రూ.1000 వ్రతాలు 17,714, రూ.1500 వ్రతాలు 10,269, రూ.2000 వ్రతాలు 12,238 జరిగాయి. ఈ ఏడాది కార్తీకమాసంలో భక్తులు ఎటువంటి ఇబ్బందులు రాకుండా అలయ అధికారులు చర్యలు తీసుకోవడంతో త్వరితగతిన వ్రతాలు, దర్శనాలు పూర్తిచేసుకోగలిగారు. ప్రధానంగా ఎక్కడా ట్రాఫిక్ ఇబ్బందులు కలగనివ్వలేదు. గిరి ప్రదక్షిణ మధ్యాహ్నం సత్యరథంతో ప్రారంభించడం సత్ఫలితాలు ఇచ్చింది. పడమట రాజగోపురం వద్ద కంపార్టుమెంట్లు ఏర్పాటు, క్యూలైన్‌లు పొడిగించడంతో సాధ్యమైంది. ఈ ఏడాది కార్తీకమాసంలో అన్ని విభాగాల ద్వారా సుమారు రూ.20 కోట్లు ఆదాయం వస్తుందని అంచనా వేస్తున్నారు. సోమవారం జరిగే హుండీల లెక్కింపుతో లెక్కతేలిపోనుంది. ఒక్క వ్రతాల ద్వారా సుమారు రూ.8కోట్లు ఆదాయం రావొచ్చని అంచనా. కౌంటర్లలో 143708 వ్రతం టిక్కెట్లు విక్రయించగా ఆన్‌లైన్ ద్వారా 3414 టిక్కెట్లను భక్తులు బుకింగ్ చేసుకున్నారు. వ్రత పురోహితులు, సిబ్బంది సమష్టిగా కృషి చేశారు.

మంత్రి సుభాష్ పూజలు

రత్నగిరివాసుడైన సత్యదేవుని సన్నిధిలో ఆదివారం మంత్రి వాసంశెట్టి సుభాష్ కుటుంబసభ్యులతో స్వామిని దర్శించి ప్రత్యేకపూజలు చేశారు. ఆయనకు ఆలయ ప్రోటోకాల్ సూపరింటెండెంట్ బలువు సత్యశ్రీనివాస్ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. దర్శనానంతరం వేద పండితులు వేదాశీర్వచనాలు అందజేశారు.



సత్యదేవుని దర్శనానంతరం మంత్రి సుభాష్

విఘ్నేశ్వరస్వామి ఆదాయం రూ.83.77 లక్షలు



అయినవిల్లి విఘ్నేశ్వరస్వామి

అయినవిల్లి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అయినవిల్లి శ్రీవిఘ్నేశ్వరస్వామివారి దేవస్థానం పవిత్ర కార్తీకమాసాన్ని పురస్కరించుకుని గతేడాది కంటే అధిక ఆదాయం పొందినట్టు ఆలయ ఈవో ముదునూరి సత్యనారాయణరాజు ఆదివారం తెలిపారు. గత నెల 2వ తేదీ నుంచి డిసెంబరు 1 వరకు సిద్ధివినాయస్వామివారిని 2.76లక్షల మంది భక్తులు దర్శించుకున్నారని, 1.26లక్షల మంది అన్నప్రసాదం స్వీకరించారన్నారు. గతేడాది రూ.46,13,318 ఆదాయం రాగా ఈ ఏడాది రూ.83,77,303 ఆదాయం వచ్చినట్టు తెలిపారు. గత కార్తీకమాసానికంటే అదనంగా రూ.37,63,985 అధిక ఆదాయం లభించిందన్నారు. అమలాపురం పట్టణానికి చెందిన దువ్వూరి లక్ష్మీఉదయ, శ్రీరామ భాస్కరకుమారి కుటుంబ సభ్యులు స్వామిని దర్శించుకుని విఘ్నేశ్వర అన్నప్రసాద ట్రస్టుకు రూ.16,816 విరాళంగా అందజేశారు. ఆలయ ప్రధానార్చకులు వేదాశీర్వచనం అందజేసి దాతలను శేషవస్త్రంతో సత్కరించి స్వామి చిత్రపటంఅందజేశారు.

బాలబాలాజీ ఆదాయం రూ.57.45 లక్షలు



అప్పనపల్లి బాలబాలాజీస్వామి

మామిడికుదురు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు మండలం అప్పనపల్లి బాలబాలాజీ స్వామివారికి కార్తీకమాసం నెల రోజుల ఆదాయం రూ.57,45,465 వచ్చినట్టు సహాయ కమిషనర్ ఎం.సత్యనారాయణరాజు తెలిపారు. నెలరోజుల పాటు స్వామివారిని 2,28,360 మంది దర్శించుకున్నారని, వారిలో 1,01,280 మంది అన్నప్రసాదం స్వీకరించినట్టు తెలిపారు. గత సంవత్సరం కార్తీకమాసంలో స్వామివారికి ఒక నెలకు రూ.30,25,266 ఆదాయం వచ్చిందని, గతేడాది కంటే ఈ సంవత్సరం ఆదాయం రూ.27,27,199 అధికంగా వచ్చినట్టు తెలిపారు. భక్తులకు ఇబ్బందులు రాకుండా ఏర్పాట్లు చేశామని, సహకరించిన సిబ్బంది,నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

2 గంటల్లో ముంబై

రాజమహేంద్రవరం టూ ముంబైకి ఎయిర్‌బస్

ప్రారంభించిన మంత్రి కందుల దుర్గేష్



విమాన సర్వీసును ప్రారంభించి కేక్ కట్ చేస్తున్న మంత్రి దుర్గేష్, ఎమ్మెల్యేలు

రాజమహేంద్రవరం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కేవలం రెండు గంటల్లోనే రాజమహేంద్రవరం నుంచి ముంబైకి వెళ్లవచ్చని రాష్ట్ర పర్యాటక శాఖమంత్రి కందుల దుర్గేష్ అన్నారు. రాజమహేంద్రవరం (మధురపూడి) విమానాశ్రయం నుంచి ఆదివారం సాయంత్రం 6.30 గంటలకు తొలిసారిగా ముంబైకి నేరుగా విమాన సర్వీసును ప్రారంభించి మాట్లాడారు. ఎయిర్ బస్సు సర్వీసుతో రాజమహేంద్రవరం, ముంబైకి మధ్య దూరం తగ్గిందన్నారు. ఈ నెల 12 నుంచి న్యూఢిల్లీకి ఇక్కడ నుంచి విమాన సర్వీసు ఆరంభమవుతుందన్నారు. కేంద్ర మంత్రి రామ్మోహనాయుడు, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి పట్టుదలతో ఎయిర్‌బస్ సర్వీసును వేశారన్నారు. ఎయిర్‌పోర్టు డైరెక్టర్ జ్ఞానేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి రోజూ సాయంత్రం 4.50 గంటలకు ముంబై నుంచి బయలుదేరి రాజ మహేంద్రవరం ఎయిర్‌పోర్టుకు 6.45 గంటలకు చేరుతుందన్నారు. ఈ ఎయిర్‌బస్సు రాత్రి 7.15 గంటలకు ఇక్కడ నుంచి తిరిగి బయలుదేరి రాత్రి 9.05 గంటలకు ముంబై చేరుకుంటుందని చెప్పారు. తొలిరోజు అరగంట ఆలస్యంగా ఎయిర్‌బస్ వచ్చినట్టు చెప్పారు. ముంబై, రాజమహేంద్రవరం మధ్య కేవలం గంట 50 నిమిషాల ప్రయాణం ఉంటుందన్నారు. తొలిరోజు ముంబై నుంచి 172 మందితో రాజమహేంద్రవరం వచ్చిందని చెప్పారు. తిరిగి ఈ ఎయిర్‌బస్సులో 120 మంది ముంబై వెళ్లారని తెలిపారు. ఈనెల 12వ తేదీ నుంచి రాజమహేంద్రవరం నుంచి నేరుగా న్యూఢిల్లీకి ఇండిగో విమాన సర్వీసు ఆరంభమవుతుందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు బత్తుల బలరామకృష్ణ గోరంట్ల బుచ్చయ్యచౌదరి, ఆదిరెడ్డి వాసు, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, ముప్పిడి వెంకటేశ్వరరావు, రుడా ఛైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి, బీజేపీ నేతలు నీరుకొండ వీరన్నచౌదరి, జవ్వాది లక్ష్మీనారాయణ తదితరులు ఉన్నారు.

ఉప్పాడ తీరంలో అలల ఉధృతి



ఉప్పాడ బీచ్‌రోడ్డు పైకి ఎగసిపడుతున్న కెరటాలు

బీచ్‌రోడ్డును తాకుతున్న కెరటాలు

కొత్తపల్లి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం ఉప్పాడ తీరంలో ఆదివారం కూడా కెరటాల ఉధృతి కొనసాగుతూనే ఉంది. సాధారణ స్థాయి కంటే 2 నుంచి 3 మీటర్ల ఎత్తులో ఎగసిపడిన రాకాసి అలలు ఉప్పాడ-నేమాం మధ్య బీచ్‌రోడ్డుపైకి దూసుకొస్తున్నాయి. సుబ్బంపేట, కొత్తపట్నం, విద్యుత్ ప్లాంటు ప్రాంతాల్లో కెరటాలు ఉవ్వెత్తున గాలిలో లేస్తూ బీచ్‌రోడ్డును బలంగా తాకుతున్నాయి. దీంతో రోడ్డుకు అడుగు భాగంలో ఉన్న కంకర రాళ్ల రోడ్డుపైకి విసిరేసినట్టు ఎగిరిపడుతున్నాయి. పెద్ద వంతెన సమీపంలో నిర్మించిన అప్రోచ్ వంతెన రోడ్డుపై సముద్ర కెరటాలు విరుచుకుపడుతున్నాయి. సముద్రం అల్లకల్లోలంగా ఉండడంతో బీచ్‌రోడ్డులో రాకపోకలను నియంత్రించేందుకు స్థానిక పోలీసులు చర్యలు చేపట్టారు.

ఘనంగా అఖండ కోటి దీపారాధన



సామర్లకోట భీమేశ్వరాలయంలో దీపాలను వెలిగించిన దృశ్యం

సామర్లకోట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం ముగింపు పురస్కరించుకుని కాకినాడ జిల్లా సామర్లకోట కుమార రామ భీమేశ్వరాలయంలో ఆదివారం రాత్రి అఖండ కోటిదీపారాధన పూజలు ఘనంగా నిర్వహించారు. కార్తీకదీపారాధన సేవాసంఘం సభ్యుల ఆధ్వర్యంలో ఆలయ ఆవరణ అంతటా చమురు వత్తుల ప్రమిదలతో కూడిన దీపాలను అలంకరించారు. గణపతికి ముందుగా పూజలు నిర్వహించి పండితులచే గంట మోగించగా వందలాది భక్తులు దీపాలను ఒకేసారి వెలిగించడంతో ఆలయ ఆవరణ దీపపు కాంతులతో దేదీప్యమానంగా మారింది. వర్షం కురుస్తున్నా ఏమాత్రం లెక్కించకుండా అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పోలిపాడ్యమి అంటే..

కార్తీకమాసంలో వచ్చే చివరి రోజును పోలి స్వర్గం అని అంటారు. డిసెంబరు 1తో కార్తీకం ముగిసింది. మరుసటి రోజును పోలి పాడ్యమి అంటారని సామర్లకోట కుమారరామ భీమేశ్వరాలయ అభిషేక పండిట్ వేమూరి సోమేశ్వరశర్మ వెల్లడించారు. దీనితర్వాత రోజు నుంచే మార్గశిరం మాసం ప్రారంభం అవుతుంది. పోలిపాడ్యమి రోజున భక్తులు శివాలయాల్లో పూజలు చేస్తారు. ఈ రోజున 30 వత్తులతో దీపాలను వెలిగించడం ప్రత్యేకత.



వాన.. వల!

యానాం గౌతమీ గోదావరి పుష్కర ఘాట్ వద్ద ఆదివారం వర్షంలో కూడా ఓ మత్స్యకారుడు చేపల కోసం వల వేస్తూ ఇలా కనిపించాడు

-యానాం

మహాకుంభాభిషేక మహోత్సవం



కత్తిపూడిలో కలశాలతో వేలాదిగా తరలివస్తున్న భక్తులు

కత్తిపూడిలో విశాలాక్షి సమేత విశ్వేశ్వరస్వామికి అభిషేకం

శంఖవరం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా శంఖవరం మండలంలో కత్తిపూడి విశాలాక్షి సమేత విశ్వేశ్వరస్వామివారి మహాకుంభాభిషేక మహోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. గ్రామమంతా శివ పంచాక్షరీనామంతో మార్మోగింది. పరసర ప్రాంతాల నుంచి తరలివచ్చిన వేలాదిమంది భక్తులతో, సువాసినీ మహిళలతో నిర్వహించిన కార్యక్రమం కనుల పండువగా జరిగింది. కార్తీకమాస అమావాస్య పర్వదినాన సప్తనదీ జలాలతో పురవీధుల్లో తిరిగి పరమశివుడికి అభిషేకం చేశారు. వేలాదిమంది సువాసినీ మహిళలు కలశాలతో గ్రామపుర వీధుల్లో గ్రామోత్సవం నిర్వహించి అనంతరం స్వామి,అమ్మవార్లకు ఏకకాలంలో అభిషేకం నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయ పూజారి ర్యాలీ సుబ్రహ్మణ్యకుమార్, ధర్మకర్త మంచాల సత్యనారాయణ ఆధ్వర్యంలో పూజలు, హోమాలు నిర్వహించారు. స్వామి, అమ్మవార్లకు అభిషేక అనంతరం మహా అన్న సమారాధన నిర్వహించారు. పరిసర ప్రాంతాల నుంచి వేలాదిమంది పాల్గొన్నారు.



ఆలయ శిఖరానికి అభిషేకం నిర్వహిస్తున్న దృశ్యం

ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఉల్లంఘన!

అక్రమాలకు పాల్పడిన రంపచోడవరం

గిరిజన సంక్షేమ ఇన్‌చార్జి డీడీ

ఉన్నతాధికారులకు తెలియకుండా

14 మంది సిబ్బందికి డిప్యుటేషన్లు

ఎన్నికల సంఘం, ఉన్నతాధికారులకు

ఆదివాసీ సంఘం ఫిర్యాదులు

రంపచోడవరం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉండగా రంపచోడవరంలోని గిరిజన సంక్షేమ ఇన్‌చార్జి డీడీ ఒకరు అక్రమాలకు పాల్పడి 14 మంది సిబ్బందిని డిప్యుటేషన్లపై బదిలీ చేస్తూ వివాదస్పద ఉత్తర్వులు జారీ చేశారు. ఈ బాగోతాన్ని ఆదివాసీ ఉద్యోగుల సంక్షేమ సాంస్కృతిక సంఘం వెలుగులోకి తెచ్చి ఎన్నికల సంఘానికి, జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తూ ఆ సమాచారాన్ని మీడియాకు తెలిపారు. ఈ బాగోతం పూర్వాపరాలు ఇలా ఉన్నాయి. గిరిజన సంక్షేమ డిప్యూటీ డైరెక్టర్ కార్యాలయం రంపచోడవరం ఐటీడీఏ కార్యాలయానికి అనుబంధంగా నడుస్తోంది. ఈ డిప్యూటీ డైరెక్టర్ పోస్టు గత కొన్నేళ్లుగా ఇన్‌చార్జిలతోనే నడుస్తోంది. ఇటీవల ఈ పోస్టుకు వేరే అధికారిని ఇన్‌చార్జిగా నియమించారు. సదరు అధికారి రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి, చింతూరు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి నుంచి ఎటువంటి ఆమోదాలు తీసుకోకుండానే ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉండగానే తన కార్యాలయం నుంచి డిప్యుటేషన్లపై బదిలీలు చేపట్టారు. ఈ వ్యవహారంలో పెద్ద ఎత్తున ముడుపులు ఆయా అధికారులకు, కార్యాలయం సిబ్బందికి ముట్టాయని ఆదివాసీ సాంస్కృతిక సంఘం నాయకులు కత్తుల ఆదిరెడ్డి, తాడే రాజబాబు ఆరోపించారు. తక్షణం సదరు అధికారిని డీడీ బాధ్యతల నుంచి తప్పించాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా ఎన్నికల సంఘం, ఎన్నికల ఉన్నతాధికారులు అధికారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

కన్నబాబు.. అప్పుడు నోరు పెగల్లేదేమి?

ఇప్పుడు రేషన్ బియ్యం అవినీతిపై ఉలికిపాటెందుకు

కాకినాడ సిటీ ఎమ్మెల్యే కొండబాబు మండిపాటు



ఎమ్మెల్యే కొండబాబు

కాకినాడ సిటీ, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): వైసీపీ ఐదేళ్ల పాలనలో కాకినాడ పోర్టు నుంచి లక్షల టన్నుల రేషన్ బియ్యం అక్రమంగా ఎగుమతి అయినా వైసీపీ నేతల నోళ్లు పెగల్లేదని, కళ్లముందే వందల కోట్ల రూపాయల బియ్యం ద్వారంపూడి తరలించినా మంత్రి హోదాలో కన్నబాబు కళ్లప్పగించి చూశారని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు మండిపడ్డారు. కాకినాడలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ అప్పుడు ద్వారంపూడికి భయపడి కన్నబాబు నోరు మెదపలేదన్నారు. బియ్యం ఎగుమతిలో వైసీపీ నేతలు ఉండడం వల్లే ప్రశ్నిస్తే మంత్రి పదవి పోతుందని కళ్లప్పగించి చూశారన్నారు. గడచిన ఐదేళ్లలో పోర్టులో రేషన్ బియ్యం అక్రమ ఎగుమతిపై తాను పోరాడానన్నారు. ఈ బియ్యాన్ని తనిఖీ చేసేందుకు పోర్టు లోపలికి వెళ్తే తమపై అక్రమ కేసులు పెట్టించారని, తప్పులు చేయకపోతే తమపై అక్రమ కేసులు ఎందుకు పెడతారని అన్నారు. కాకినాడ టీడీపీ కార్యాలయంపై దాడికి ఎందుకు దిగారని, ఆ రోజు కన్నబాబు నోరు ఎందుకు పెగల్లేదన్నా రు. ద్వారంపూడి ఐవరీ కోస్టుకు వెళ్లి బియ్యం గొడౌన్‌లు కట్టించాడని తాను ఆధారాలతో సహా బయటపెట్టానన్నారు. కూటమి ప్రభుత్వం రేషన్ బియ్యం అక్రమ ఎగుమతిపై ఉక్కుపాదం మోపుతుంటే పెడబొబ్బలు పెడుతున్నారని కొండబాబు అన్నారు.

దుబాయ్‌లో పేరవరం వాసి అనుమానాస్పద మృతి



రమేష్(ఫైల్)

పది రోజుల క్రితమే మృతి

మంత్రులు లోకేశ్, నిమ్మల సహకారంతో

నేడు స్వగ్రామానికి మృతదేహం

కన్నీరుమున్నీరవుతున్న బంధువులు

ఆత్రేయపురం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): జీవనోపాధి కోసం దుబాయ్ వెళ్లిన ఓ యువకుడు అనుమానాస్పదంగా మృతిచెందాడు. పదిరోజులు కావొస్తున్నా మృతదేహం ఇంటికి రాకపోవడంతో ఆ కుటుంబ సభ్యులు వేదన చెందుతున్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం పేరవరం గ్రామానికి చెందిన అంగర రమేష్(35) దుబాయ్‌లోని డేరా ప్రాంతంలోని ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేసేవాడు. ఏడాదిన్నర క్రితం వెళ్లి ఉద్యోగంలో చేరినా మధ్యలో స్వగ్రామం వచ్చి 6 నెలల క్రితమే తిరిగి వెళ్లాడు. రమేష్‌కు భార్య కవితాదేవి, ఇద్దరు కుమారులు ఉన్నారు. అక్కడ పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు.ఇదిలా ఉండగా గత నెల 15న అనుమానాస్పదంగా మృతిచెందాడు.అక్కడ మిత్రులు కుటుంబీకులకు సమాచారం అందించారు. అయితే మృతదేహాన్ని స్వగ్రామానికి పంపించడంలో జాప్యం జరుగుతోంది. రమేష్ మృతిపై అక్కడ ప్రభుత్వం విచారణలో తేల్చాల్సి ఉంది. ఈ నేపథ్యంలో రమేష్ భార్య కవిత బంధువులు ఈ విషయాన్ని రాష్ట్ర మంత్రి నిమ్మల రామానాయుడు దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే మంత్రి లోకేశ్‌కు విషయాన్ని వివరించారు.అక్కడ ప్రతినిధులతో మాట్లా డి మృతదేహాన్ని స్వగ్రామానికి రప్పించే చర్యలు వేగవంతం చేశారు. దుబాయ్ నుంచి విమానంలో మృతదేహాన్ని గన్నవరం ఎయిర్‌పోర్టుకు వచ్చే ఏర్పాట్లు చేపట్టారు. సోమవారం గన్నవరం ఎయిర్‌పోర్టు నుంచి మృతదేహాన్ని స్వగ్రామం తీసుకువస్తున్నట్టు సమాచారం.రమేష్ మృతితో పేరవరం గౌడపేటలో విషాదఛాయలు అలుముకున్నాయి. బంధు మిత్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

పాపికొండలకు పోటెత్తిన పర్యాటకులు



పేరంటాలపల్లిలో పర్యాటకుల సందడి

దేవీపట్నం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): పాపికొండలు అందాలను తిలకించేందుకు ప్రకృతి ప్రేమికులు తెలుగు రాష్ట్రాల నలుమూలల నుంచి ఆదివారం వెళ్లారు. అల్లూరి జిల్లా దేవీపట్నం మండల పరిధిలోని పోశమ్మగండి బోట్ పాయింట్ నుంచి గోదావరి పరివాహక ముంపు ప్రాంతాలైన పూడిపల్లి, దేవీపట్నం, మంటూరు, గొందూరు, కచ్చులూరు, కొండమొదలు తదితర గ్రామాల మీదుగా పేరంటాలపల్లి వెళ్లి ఆ గ్రామంలో శివున్ని దర్శించుకుని సందడి చేశారు. ముందుగా మాతృశ్రీ గండిపోశమ్మఅమ్మవారిని దర్శించుకుని అనంతరం ఆరు బోట్లలో 450 మంది పర్యాటకులు పాపికొండలు వెళ్లారు. గోదావరి వరదల అనంతరం గండిపోశమ్మ అమ్మవారి దర్శనం పునఃప్రారంభించగా రెండో ఆదివారం దర్శనానికి అధిక సంఖ్యలో భక్తులు పోటెత్తారు. అమ్మవారికి వేకువజాము నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.

సివిల్ సర్వీసెస్ ఉచిత కోచింగ్‌కు 13 మంది ఎంపిక

రాజమహేంద్రవరం సిటీ డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో సివిల్ సర్వీసెస్ ఉచిత కోచింగ్ ప్రవేశ పరీక్షల్లో 13 మంది అభ్యర్థులు అర్హత సాధించారని బీసీ సడీ సర్కిల్ సంచాలకులు కెఎన్.జ్యోతి తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. సివిల్ సర్వీస్ ఉచిత కోచింగ్‌కు నిర్వహించిన ప్రవేశ పరీక్షకు 70 మంది హాజరు కాగా 13 మంది అర్హత సాధించారన్నారు. రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గొల్లపూడి కేంద్రంలో 6నెలల పాటు యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ పరీక్షకు ఉచిత శిక్షణ అందించడం జరుగుతుందని, ఉచిత సివిల్ కోచింగ్‌కు ఎంపికైన అభ్యర్థులు శిక్షణ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

'రేషన్ బియ్యం అక్రమాల్లో నా పాత్ర లేదు'

కలెక్టరేట్(కాకినాడ), డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ వ్యాఖ్యలను వక్రీకరిస్తూ కొందరు ప్రచారం చేస్తున్నారని, ఎక్కడా తన కోసం ఆయన తప్పుగా మాట్లాడలేదని శాన్‌మెరైన్ సంస్థ అధినేత అలీషా ఆదివారం ఒక ప్రకటన వెలువరించారు. రేషన్ బియ్యం అక్రమాల్లో తన పాత్ర ఎక్కడా లేదన్నారు. తనిఖీల్లో భాగంగా పవన్ కేవలం అలీషా ఎవరని అడిగారన్నారు. పోర్టులో బియ్యం ఎగుమతి, దిగుమతులతో తనకు సంబంధం లేదని, తనకు ఉన్న ఏకైక వ్యాపారం నౌకలను తయారు చేయడం మాత్రమేనన్నారు. రేషన్ అక్రమ రవాణాలో ఏ భాగస్వామ్యంలేదని తెలిపారు.

రాజమహేంద్రవరం

• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి

అలరించిన తులసీనాథ్ గాత్రకచేరి



సంగీత నీరాజనం కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న జేసీ చినరాముడు

రాజమహేంద్రవరం కల్చరల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): వెంకటేశ్వర ఆనం కళాకేంద్రంలో ఆదివారం సాయంత్రం విదుషీమణి తులసీనాథ్ గాత్ర కచేరీ,సంగీత నృత్య కార్యక్రమాలు ప్రేక్షకులను అలరించాయి. భారత ప్రభుత్వ పర్యాటక సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని జేసీ ఎస్.చినరాముడు ప్రారంభించారు. అనంతరం విదుషీమణి తులసీనాథ్ గాత్రం,పెరవలి నందకుమార్ వయొలిన్,మండపాక రవి మృదంగ సహకారంతో శ్రోతలను పరవశింపజేశారు. విద్యార్థుల సంగీత,నృత్య ప్రదర్శనలతో ప్రేక్షకులను పరవశింపజేశారు.ఎం.నరసింహారావు ప్రార్థనా గీతం ఆలపించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర సంగీత నాటక అకాడమి సభ్యులు సత్యనారాయణ, కేంద్ర సాంస్కృతిక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ప్రవీణ్‌కుమార్, టూరిజం ప్రాంతీయ సంచాలకులు వెంకటాచలం, విజయ శంకర నృత్య పాఠశాల ప్రిన్సిపాల్ ఎంనాగలక్ష్మి,ఎస్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పీజీ స్పాట్ అడ్మిషన్ల గడువు పొడిగించండి

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): పీజీ స్పాట్ అడ్మిషన్ల గడువు పొడిగించాలని రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు ముళ్ళ మాధవ్, ఉపాధ్యక్షుడు యస్‌యస్‌ఆర్ భార్గవ, కార్యదర్శి గద్దే సుధాకర్ కోరారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. గత నెల 26 నుంచి 29వ తేదీ వరకు మాత్రమే పీజీ సెట్ 2024 వెబ్‌సైట్‌లు ద్వారా దరఖాస్తు చేసుకునే విధంగా అవకాశం ఇచ్చినా సాంకేతిక సమస్యల వల్ల పనిచేయలేదన్నారు. 28న నుంచి మాత్రమే వెబ్‌సైట్ పనిచేసిందన్నారు. దీంతో చాలా మంది దరఖాస్తులు చేసుకోలేకపోయారన్నారు. గడువు పొడిగించకపోతే విద్యార్థులు నష్టపోతారని స్పష్టం చేశారు. ఒకవారం రోజులు పీజీ స్పాట్ అడ్మిషన్ల దరఖాస్తు గడువు పొడిగించాలని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు విజ్ఞప్తి చేస్తున్నామన్నారు.

చెరువెక్కడ?

- అస్తిత్వాన్ని కోల్పోతున్న చెరువులు
- ఉన్నవీ అభివృద్ధికి నోచుకోని వైనం
- పట్టించుకోని అధికారులు
- చక్రద్వారబంధంలో డంపింగ్ యార్డుగా మారిన వీరన్న చెరువు



దంపింగ్ యార్డుగా దర్శనమిస్తున్న వీరన్న చెరువు, చెత్తను డంపింగ్ చేస్తున్న దృశ్యం



రాజానగరం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): సకల ప్రాణి కోటికి అవసరమైన తాగు, సాగు నీరందించే చెరువులు నేడు కాలగర్భంలో కనుమరుగైపోతున్నాయి. భూగర్భ జలాలను పెంపొందించడంలో కీలక భూమిక పోషించే చెరువులను పరిరక్షించాల్సిన ప్రభుత్వ యంత్రాంగం, పాలకులు పట్టనట్టు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఓ వైపు చెరువుల అభివృద్ధి పేరుతో కోట్లాది రూపాయలు వెచ్చిస్తుంటే, మరో వైపు కొంతమంది స్వార్థపరులు గ్రామీణ ప్రాంతాల్లో చెరువులను అందినంత మేర అవసరమైన మట్టిని తవ్వేసుకుని, ఆనక వాటిని గ్రామ పంచాయతీ పరిధిలో సేకరించే చెత్తకుప్పలతో పూడ్చేస్తున్నారు. ఇందుకు రాజానగరం మండలం చక్రద్వారబంధంలోని వీరన్న చెరువు అందుకు నిదర్శనం. గ్రామంలో సర్వే నెంబర్ 569లో 1.05 ఎకరాలు, సర్వే నెంబరు 568/3డిలో మరో 8 సెంట్లు కాలిదారిగా ఏ రిజిస్టర్‌లో దఖలు పడి ఉంది. అయితే ప్రస్తుతం వీరన్న చెరువును డంపింగ్‌యార్డుగా మార్చేశారు. పారిశుధ్య కార్మికులు గ్రామంలో సేకరించిన చెత్తా, చెదారాలను కొన్నేళ్లుగా ట్రాక్టర్లతో తరలించి చెరువులో పోసేస్తున్నారు. దీంతో చెరువు స్వరూపం కోల్పోవడమే కాకుండా భూగర్భ జలాలు అడుగంటి, కనీసం మూగజీవాలు దాహార్తిని తీర్చుకునే అవకాశం లేదు. అంతే కాకుండా పాడి పశువులు ఉష్ణతాపానికి గురికాకుండా చెరువుల్లో ఉపశమనం పొందుతుండేవి. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. గతంలో ప్రకృతి వైపరీత్యాల కారణంగా ఎదురైన అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం చెరువుల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

6న అంబేడ్కర్ వర్ధంతి

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ 68వ వర్ధంతి కార్యక్రమాలకు సంబంధించిన కరపత్రాన్ని ఆదివారం రాజమహేంద్రవరంలో ఆవిష్కరించారు. కార్పొరేషన్ కార్యాలయం ఎదురుగా అంబేడ్కర్ విగ్రహం వద్ద ఈ నెల 6న ఆయన వర్ధంతి నిర్వహిస్తామని ఎస్సీ ఎస్టీ సంఘాల నాయకులు కోరుకొండ చిరంజీవి, తాళ్లూరి బాబు రాజేంద్రప్రసాద్ తెలిపారు.

రైతులు ఆందోళన చెందొద్దు

- తుఫాన్ ప్రభావం తక్కువే
- రాజానగరం వ్యవసాయాధికారి ఇమామి ఖాసిం



రాజానగరం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత ఫెంగల్ తుఫాన్ ప్రభావం వల్ల రాజానగరం మండల రైతాంగానికి పెద్దగా నష్టం వాటిల్లే అవకాశం లేదని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వ్యవసాయాధికారి షేక్ ఇమామి ఖాసిం అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ మండలంలో ఇప్పటికే దాదాపుగా వరి కోతలు పూర్తయ్యాయని, సుమారు వెయ్యి మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామన్నారు. వెలుగుబంద, నందరాడ, సీతారాంపురం గ్రామాల్లో వరి నాట్లు ఆలస్యంగా వేయడం వల్ల ఇప్పుడు కోత దశకు చేరుకున్నాయన్నారు. తుఫాను ప్రభావంతో మూడు రోజుల నుంచే వరి కోతలు వాయిదా వేసుకోవాలని సూచించామన్నారు. స్వర్ణ రకాలు కోతలు పూర్తయ్యాయని, ఎంటీయూ 1318 వరి రకాలు ఆలస్యంగా కోతకు వచ్చాయని, అయితే మరో వారం రోజులు వరకు కోతలు కోయవద్దని రైతులకు సూచించినట్టు వ్యవసాయాధికారి ఇమామి ఖాసిం చెప్పారు.

దేశం దృష్టిని ఆకర్షిస్తున్న కూటమి పథకాలు

ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజాసంక్షేమ పథకాలు దేశం దృష్టిని ఆకర్షిస్తున్నాయని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. జగన్ అంతటి ఆర్థిక నేరగాడు మరొకడు లేడన్నారు. రాష్ట్రాన్ని గాడిలో పెట్టగలరనే నమ్మకంతోనే చంద్రబాబుకు పట్టం కట్టారని చెప్పారు. నిరుపేదలకు ఎన్‌టీఆర్ భరోసా పింఛన్లు సమర్థవంతంగా అందిస్తున్నామన్నారు.

గోపిమూర్తికి మొదటి ప్రాధాన్య ఓటు వేయాలి

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీడీఎఫ్ అభ్యర్థి బొర్రా గోపిమూర్తికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని ఏపీటీఎఫ్ (1938) జిల్లా కార్యవర్గం పిలుపునిచ్చింది. రాజమహేంద్రవరం నెహ్రూనగర్ మునిసిపల్ పాఠశాలలో ఆదివారం జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కేవీవీ.సత్యనారాయణ, జిల్లా గౌరవాధ్యక్షుడు అప్పయ్య శాస్త్రి, జిల్లా అధ్యక్షుడు డేవిడ్ లివింగ్ స్టన్, నగర అధ్యక్షుడు జి.తాతారావు, ప్రధాన కార్యదర్శి ఎన్‌జీ.శంకర్, జి.శ్రీనివాస్,శాస్త్రి, ఎం.పద్మజ తదితరులు పాల్గొన్నారు.

బాలికా సదనం చిన్నారులకు వితరణ



రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాలికా సదనంలో చిన్నారులకు ఆదివారం ఆర్యాపురం కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ చైర్మన్ చల్లా శంకర్రావు దుప్పట్లు, పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. చల్లా శంకర్రావు పుట్టినరోజు సందర్భంగా న్యాయవాది నూకల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఈ సేవా కార్యక్రమం నిర్వహించారు. బాలికా సదనం అవసరతలు ఉంటే వాటిని తప్పక తాను తీరుస్తానన్నారు. కార్యక్రమంలో నన్నయ వర్శిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎం.గోపాలకృష్ణమూర్తి న్యాయవాది ఎస్వీ మణికంఠ, సైకాలజీ విద్యార్థులు దేవి అలేఖ్య, కిరణ్, లహరి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఆకాశ దీపారాధనలు

కోరుకొండ, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం 30రోజులుగా నిర్విరామంగా సాగిన ఆకాశ దీపారాధనలు ముగిశాయి.ఈ సందర్భంగా ఆదివారం సాయంత్రం స్థానిక విశ్వేశ్వరస్వామి ఆలయం, లక్ష్మినరసింహస్వామి దేవస్థానం వద్ద వెంకటేశ్వరస్వామి ఆలయం, జంబుపట్నం శివాలయం, బూరుగుపూడి సాయిబాబా ఆలయం వద్ద పూజలు చేశారు.

ఎయిడ్స్‌పై అవగాహన అవసరం

- ఆర్‌ఐవో నరసింహం
- ప్రపంచ ఎయిడ్స్ నివారణా దినం
- పలుచోట్ల విద్యార్థుల ర్యాలీలు



రాజమహేంద్రవరంలో ర్యాలీ చేస్తున్న పారామెడికల్ ఉద్యోగులు

రాజమహేంద్రవరం అర్బన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఎయిడ్స్ వ్యాధిబారిన పడకుండా యువత అప్రమత్తంగా ఉండాలని ఆర్‌ఐవో ఎస్‌వీఎల్.నరసింహం అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ డే సందర్భంగా ఆదివారం రెడ్‌క్రాస్ సొసైటీ, జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో ఎయిడ్స్ నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రెడ్‌క్రాస్ భవన ఆవరణలో మొక్కలు నాటారు. ఎయిడ్స్‌ను అంతం చేసే దిశగా ప్రభుత్వం కార్యక్రమాలు చేపడుతున్నదన్నారు. యువత జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ రామకృష్ణ, సిబ్బంది సోమసుందరం, పద్మావతి, జీఎన్‌వీఏబీఎస్.మహాలక్ష్మి, కేవీ.రమణ, ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ ఏ.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ రహిత సమాజానికి కృషి

రాజమహేంద్రవరం కల్చరల్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఎయిడ్స్ రహిత సమాజానికి ప్రతి ఒక్కరూ పాటుపడాలని పీఎంపీ అసోసియేషన్ జాతీయ కార్యదర్శి వీబీటీ.రాజు అన్నారు. కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో దివాన్‌చెరువు వద్ద హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ చేశారు. రాష్ట్ర అధ్యక్షుడు తోరాటి ప్రభాకరరావు మాట్లాడుతూ హెచ్ఐవీ సోకిన వారు, ఏఆర్‌టీ మందులతో సంపూర్ణ ఆరోగ్యవంతులవుతారన్నారు. ఆదిత్య డిగ్రీ కళాశాల, ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు ర్యాలీ చేశారు. ఆర్‌టీసీ కాంప్లెక్స్ నుంచి తిలక్ రోడ్డు మీదుగా వీఎల్ పురం వరకు ర్యాలీ సాగింది. కార్యక్రమంలో ఎస్.వేణుగోపాల్, బళ్ల శ్రీనివాసరావు, పి.దేవానందం, పి.చిన్ని, బుడ్డిత అప్పారావు, ఆదిత్య డైరెక్టర్ ఏస్పీ గంగిరెడ్డి, ప్రిన్సిపాల్ పి.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ బాధితులపై వివక్షత వద్దు

సీతానగరం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఎయిడ్స్ రోగుల పట్ల వివక్షత చూపకూడదని డాక్టర్లు ఏవీకే చైతన్య, ఎన్.రాజు సూచించారు. స్థానిక పీహెచ్‌సీ వద్ద నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ విచ్చలవిడి శృంగారం, కలుషితమైన సూదులు, సిరంజీలు వాడడం వల్ల ఎయిడ్స్ వస్తుందని ప్రజలకు అవగాహన కలిగిస్తున్నట్టు చెప్పారు. ఎయిడ్స్ బాధితుల పట్ల వివక్షత చూపకుండా వారు మనోధైర్యంతో జీవించేటట్టు తోడ్పాటు అందించాలని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈవో వై.సుబ్బారాయుడు, పీహెచ్ఎన్ ఆదిలక్ష్మి సూపర్‌వైజర్లు కె.సుధాకర్, జిడ్రైవకృప, సిబ్బంది పాల్గొన్నారు.



సీతానగరంలో ర్యాలీ చేస్తున్న దృశ్యం

అనపర్తిలో అవగాహన ర్యాలీ

అనపర్తి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఎయిడ్స్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలని బాధితులను అక్కున చేర్చుకుని ధైర్యం చెప్పాలని జీబీఆర్ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ ఎస్‌వీవీ సత్యనారాయణరెడ్డి అన్నారు. అనపర్తిలోని జీబీఆర్ నర్సింగ్ కళాశాల విద్యార్థినులు గ్రామంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఎయిడ్స్ నివారణపై అవగాహన కల్పించే కరపత్రాలను పంచారు. సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధికి చికిత్స కన్నా నివారణే సరైన పద్ధతని అన్నారు. కార్యక్రమంలో నర్సింగ్ విద్యార్థులు, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.



దుళ్ళలో కాపు వనసమారాధనలో మాట్లాడుతున్న మంత్రి దుర్గేష్



హ రేరామ సమాజంలో పారాయణం చేస్తున్న భక్తులు



బూరుగుపూడిలో పూజలు చేస్తున్న రుడా చైర్మన్ బీవీఆర్ చౌదరి

వనసమారాధనలతో ఐకమత్యం

● దుళ్ళలో కాపు వనసమారాధనలో మంత్రి దుర్గేష్

కడియం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి) : కార్తీక వనసమారాధనలు సంస్కృతీ సాంప్రదాయాలకు చిహ్నాలని రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. ఆదివారం కడియం మండలం దుళ్ల గ్రామంలో దుళ్ళ - కాపుసంఘం ఆధ్వర్యంలో కాపు కార్తీక వనసమారాధన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి మంత్రి కందుల దుర్గేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ కార్తీక వన సమారాధనలు సహపంక్తి భోజనాల ద్వారా ఐకమత్యం, సత్సంబంధాలు పెంపొందుతాయని అన్నారు. ఐకమత్యంతోనే అభివృద్ధి సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ, వైసీపీ నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నర్సరీ రైతులు హాజరయ్యారు.

వైభవంగా ముగిసిన కార్తీక మహోత్సవాలు

కోరుకొండ, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): చారిత్రాత్మక కోరుకొండ క్షేత్రంలో హరేరామనగర్‌లో హరేరామ భక్తజనం ఆధ్వర్యంలో 62వ కార్తీకమాసం మహోత్సవాలు ఆదివారం 30వ రోజు విష్ణు సహస్ర నామ పారాయణం, లలితా సహస్రనామం, గోవిందనామ పారాయణాలు దిగ్విజయంగా ముగించారు. గత 62 సంవత్సరాలుగా హరేరామ సమాజంలో కార్తీక మాస మహోత్సవాలు సమాజ అధ్యక్షులు కపిలవాయి నమఃశివాయశర్మ, ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ఆదివా రం పెద్దఎత్తున భక్తులు స్వామివారి అన్నదాన భవనంలో అన్నప్రసాదాలు స్వీకరించారు. గత 30రోజులుగా భక్తులందరికీ స్వామి వారి అన్నప్రసాదాలు హరేరామ భజన భక్త సమాజం కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్వామివారి కార్తీకమాస మహోత్సవాల్లో భాగంగా స్వామివారికి ఆలయ ప్రధాన అర్చకులు మిరియాల వెంకట శేష త్రిమూర్తులు మర్ల వెంకటగంగాధర సీతారామశాస్త్రిప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, హరేరామనామ సంకీర్తన భజన మండలి సభ్యులు పాల్గొన్నారు.

● చివరి ఆదివారం పవిత్రకార్తీకమాసం ముగింపు కావడంతో కోరుకొండ మండలం భార్గవగాయిత్రి బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం కార్తీక వన సమారాధన కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు, స్థానిక ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ సతీమణి బత్తుల వెంకటలక్ష్మి, బీజేపీ ఇన్‌చార్జ్ నీరుకొండ వీరన్న చౌదరిలతో సహా పలువురు కూటమి నాయకులు, ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. బూరుగుపూడి, మధురపూడి నిడిగట్ల, గాడాల, దోసకాయలపల్లి, పరిసర గ్రామాల్లోని మామిడి, జీడిమామిడి, నిమ్మ, బత్తాయి తోటలన్నీ భక్తులతో నిండాయి. రాజమహేంద్రవరం కోరుకొండ గ్రామాల మధ్య సుమారు 15 కిలోమీటర్ల మేర జాతీయ రహదారికి ఇరువైపులా ఉన్న తోటలన్నీ కార్తీక వన సమారాధనతో నిండాయి.

చురుగ్గా సాగుతున్న షష్ఠి పనులు



బిక్కవోలు సినిమాహాలు సెంటర్ ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలంకరణ

బిక్కవోలు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాల్లో పేరొందిన బిక్కవోలు శ్రీకుమారసుబ్రహ్మణ్యస్వామి షష్ఠి ఉత్సవ పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఈసందర్భంగా ఉత్సవ కమిటీ అధ్యక్షుడు ఆదివారం మాట్లాడుతూ బిక్కవోలు వంతెన వద్ద నుంచి జి.మామిడాడ వెళ్లే రోడ్డు వరకూ 2కి.మీ మేర విద్యుత్ దీపాలంకరణ చేస్తున్నామన్నారు. విద్యుత్ దీపాలంకరణతో భారీ దేవతా మూర్తులను ఏర్పాటు చేయడానికి మెయిన్‌రోడ్‌లో పెద్దఎత్తున అరపలు ఏర్పాటు చేశామన్నారు. అలాగే ఆలయంవద్ద భారీ ఎత్తున రెండు స్వాగత ద్వారాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఆలయం బయట వర్షం వచ్చినా తడకుండా బరకాలు కప్పి చలువ పందిరి నిర్మిస్తున్నామని తెలిపారు. ఈనెల 6 నుంచి 12 వరకూ స్వామివారి ఉత్సవాలు నిర్వహిస్తామని, 7న స్వామివారి షష్ఠి ఉత్సవం జరుపుతామన్నారు. 12న మహా అన్న ప్రసాదంతో ఉత్సవాలు ముగిస్తామని ఆయన వివరించారు.

మానవత్వానికి, దివ్యత్వానికి అవినాభావ సంబంధం

● శ్రీవివేకానంద



బలభద్రపురంలో ప్రసంగిస్తున్న శ్రీవివేకానంద

బిక్కవోలు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): మానవత్వానికి దివ్యత్వానికి అవినాభావ సంబంధం ఉందని ట్రూత్ స్పిరిట్యువల్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకులు శ్రీవివేకానంద సూచించారు. బలభద్రపురం ఎంఎస్ఆర్ ఫంక్షన్ హాలులో ట్రూత్ వివేకామృత ఆధ్యాత్మిక విజయోత్సవా లు ఆదివారం రెండోరోజుకు చేరుకున్నాయి. శ్రీరామతత్వం, ధర్మ మార్గం అనే అంశాలపై ప్రవచించారు. అధిక సంఖ్యలో సాధకులు పాల్గొన్నారు.

వ్యక్తిపై బీరు బాటిల్‌తో దాడి

ఇద్దరిపై కేసు

కొవ్వూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): వ్యక్తిని తలపై బీరు బాటిల్‌తో కొట్టి గాయపర్చిన ఇరువురిపై కేసు నమోదు చేసినట్టు కొవ్వూరు పట్టణ హెడ్ కానిస్టేబుల్ ఆర్.సత్యనారాయణ తెలిపారు. కొవ్వూరు మండలం దొమ్మేరు గ్రామానికి చెందిన కాటూరి వెంకటేష్ లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం మధ్యాహ్నం 3గంటలకు గ్రామంలోని దుర్గమ్మ గుడి సమీపంలో చేపలు కొనుగోలు చేయడానికి వెళ్లాడు. అదే సమయంలో మారి, ఫణిలు అక్కడికి రాగా వెంకటేష్ వాహనం అడ్డుగా ఉంది. దీంతో ఇరువురి మధ్య ఘర్షణ జరగ్గా స్థానికులు సముదాయించి వెంకటేష్‌ను పంపించేశారు. కొద్దిసేపటి తరువాత మారి, ఫణి ఇంటికి వచ్చి వెంకటేష్‌తో ఘర్షణపడి,కిందపడవేసి దాడిచేసి బీరు బాటిల్‌తో తలపై కొట్టారు.తల, కడుపు, ఛాతీపై గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆసుపత్రి సమాచారం మేరకు వెంకటేష్ ఫిర్యాదుపై కేసునమోదు చేసినట్టు హెచ్‌సీ తెలిపారు.

టీడీపీ సభ్యత్వ నమోదులో అనపర్తికి మొదటి స్థానం

● రాష్ట్రంలో అనపర్తికి 22వ స్థానం



రామవరంలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్న టీడీపీ ఇన్ చార్జి నల్లమిల్లి మనోజ్‌రెడ్డి

అనపర్తి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): తెలుగు దేశంపార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో అనపర్తి నియోజకవర్గం దూసుకుపోతుంది. గత ఎన్నికల వరకు టీడీపీ ఇన్‌చార్జిగా ఉన్న ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఎన్నికల సమయంలో బీజేపీలో చేరి ఎమ్మెల్యేగా గెలుపొందటంతో ఆయన తనయుడు అనపర్తి నియోజకవర్గ టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని తన భుజస్కందాలపై వేసుకున్నారు. సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ముందు ఆయన పార్టీ శ్రేణులతో సమావేశమై సభ్యత్వ నమోదుపై దిశా నిర్దేశం చేసి కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తూ వస్తున్నారు. ఆదివారం సాయంత్రానికి జిల్లాలో అనపర్తి నియోజకవర్గంలో 47000 సభ్యత్వాలతో మొదటి స్థానంలో ఉండగా, రాష్ట్రంలో 22వ స్థానంలో నిలిచింది. కార్యక్రమాలను మనోజ్‌రెడ్డి క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తూ ఎప్పటికప్పుడు శ్రేణులకు సలహాలు ఇస్తూ ముందుకు సాగుతున్నారు. ఈ సందర్భంగా మనోజ్‌రెడ్డి మాట్లాడుతూ అనపర్తి నియోజకవర్గంలో తెలుగుదేశంపార్టీకి సైనికులు వంటి కార్యకర్తలు ఉన్నారని వారి కృషితో సభ్యత్వ నమోదులో ముందు వరుసలో నిలుస్తున్నామని అన్నారు.

రంగంపేటలో ఎక్సైజ్ అధికారుల దాడులు

● 25మద్యం సీసాలు స్వాధీనం

, రంగంపేట డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : రంగంపేట మండలంలో ఆదివారం ఎక్సైజ్ అధికారులు పలు గ్రామాల్లో దాడులు నిర్వహించారు. రంగంపేట ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సుధ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని ముకుందవరంలో బెల్టుషాపు నిర్వహిస్తున్న కేతా నాగలక్ష్మిని అరెస్టుచేసి పది మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నామని, నల్లమిల్లి గ్రామంలో బెల్టుషాపు నిర్వాహకుడు సత్యనారాయణను అరెస్టుచేసి అతనివద్ద నుంచి 15మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేశామన్నారు. అదేవిధంగా దొడ్డిగుంట గ్రామంలో సారాబట్టీని గుర్తించి 600 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశామని అదే విధంగా వాహనాల తనిఖీ నిర్వహించి అవగాహన సదస్సులు ఏర్పాటుచేశామని అన్నారు.

ఏపీటీఎఫ్ అభ్యర్థికి మద్దతుగా ప్రచారం



ప్రచారంలో పాల్గొన్న ఏపీటీఎఫ్ నాయకులు

తాళ్లపూడి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఏపీటీఎఫ్ బలపరిచిన స్వతంత్ర అభ్యర్థి గంధం నారాయణరావుకు మద్దతుగా మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు దున్నా దుర్గారావు కోరారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ డిసెంబరు 5న జరిగే టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికలలో మండ లంలో 61 మంది ఓటర్లు ఉన్నారని వారందరూ కలిసి నారాయణరావు గెలుపునకు కృషి చేస్తారన్నారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు రాజశేఖర్, వీరాస్వామి, నాని తదితరులు పాల్గొన్నారు.

వ్యాన్ ఢీకొని యువకుడి మృతి

● మరొకరికి తీవ్రగాయాలు

చాగల్లు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బ్రాహ్మణగూడెంలో మెయిన్ రోడ్డుపై జరిగిన ప్రమాదంలో తొర్లపాటి అచ్చిబాబు(33) మృతి చెందాడు. ఎస్ఐ కె.నరేంద్ర ఆదివారం తెలిపిన వివరాల ప్రకారం.. ఊనగట్లకు చెందిన అచ్చిబాబు, తొర్లపాటి కొండయ్య నిడదవోలు నుంచి బైక్‌పై స్వగ్రామానికి తిరిగి వస్తుండగా ఎదురుగా వస్తున్న వ్యాన్ బలంగా ఢీకొట్టింది. తీవ్రంగా గాయాలైన వారిద్దరినీ వైద్యం కోసం నిడదవోలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ అచ్చిబాబు ఆదివారం మృతి చెందాడు. కాగా అచ్చిబాబుకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వెల్డింగ్ పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు.

ఎమ్మెల్యే ముప్పిడిని కలిసిన శ్రీనివాసరావు



ఎమ్మెల్యే ముప్పిడి, పెండ్యా అచ్చిబాబుతో శ్రీనివాసరావు

చాగల్లు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): టీడీపీ నాయకుడు గారపాటి శ్రీనివాసరావు.. ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, పార్టీ సీనియర్ నాయకుడు పెండ్యాల అచ్చిబాబులను కొవ్వూరులోని పార్టీ కార్యాలయంలో కలిసినట్టు ఆదివారం చెప్పారు. కాగా శ్రీని వాసరావు ఇటీవల మాజీ ప్రభు త్వ సలహాదారుడు రాజీవ్‌కృష్ణతో కలిసి టీడీపీలో చేరారు. కార్యక్రమంలో జడ్పీటీ సీ బొంత వెంకటలక్ష్మి, ధర్మవరం ఎంపీటీసీ కోమలి, ముళ్ళపూడి కాశి, యు.రాజాబాబు పాల్గొన్నారు.

2 గంటల్లోనే ముంబయికి..

మధురపూడి నుంచి ఎయిర్‌బస్ ప్రారంభం 7

శివయ్యకు జలాభిషేకం





కొవ్వూరు,డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) :కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో బాలాత్రిపు సుందరీ సమేత సుందరేశ్వర స్వామికి సహస్ర ఘటాభిషేకం నిర్వహించారు. గోష్పాదక్షేత్ర లక్ష పత్రి, లక్షకుంకుమ పూజా కమిటీ 62వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం ఉదయం గోదావరి జలాలతో సుందరేశ్వర స్వామికి సహస్ర ఘటాభిషేకం నిర్వహించారు.అనంతరం శ్రీ బాలాత్రిపుర సుందరీ సమేత సుందరేశ్వరస్వామి ఉత్సవ మూర్తులను పల్లకీపై పురవీధు ల్లో ఊరేగించారు. సుందరేశ్వర స్వామికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, లక్ష బిల్వార్చన, బాలాత్రిపుర సుందరీదేవి అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. వేదపండితులచే వేద పారాయణ, దేవతామూర్తులను విశేష అలంకరణ చేసి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో కొవ్వూరు పట్టణ పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో సుందరేశ్వరుడికి గోదావరి జలాలతో సహస్ర ఘటాభిషేకం

ఎయిడ్స్ బాధితులపై వివక్ష వద్దు

రాజమహేంద్రవరం అర్బన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఎయిడ్స్ బాధితుల పట్ల సమాజంలో వివక్షతకు తావులేదని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. ఎయిడ్స్ డే సందర్భంగా ఆదివారం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో బాధితులో కలిసి కలెక్టర్, ఇతర అధికారులు సహపంక్తి భోజనం చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఎయిడ్స్ బాధితుల పట్ల సమాజంలో వివక్షతకు వ్యతిరేకంగా చైతన్యం తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. ఎయిడ్స్ వ్యాధిబారిన పడకుండా యువతలో చైతన్యం తీసుకురావాల్సి ఉందన్నారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.ప్రకాష్‌బాబు మాట్లాడుతూ సుప్రీం కోర్టు ఆదేశాల ప్రకారం నల్సా చట్టానికి అనుగుణంగా రాజ్యాంగం కల్పించిన హక్కులపై అందరికీ సమాన హక్కు ఉందని స్పష్టం చేశారు. ఎయిడ్స్ బాధితుల గుర్తింపును బహిర్గం చేయకూడదన్నారు.కార్యక్రమంలో సమన్వయశాఖల అధికారులు,వైద్యులు,స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



ఎయిడ్స్ బాధిత చిన్నారులతో కలిసి సహఫంక్తి భోజనం చేస్తున్న కలెక్టర్, అధికారులు



అగస్త్యేశ్వరుడికి అన్నాభిషేకం

ధవళేశ్వరం,డిసెంబరు1(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం ముగింపును పురస్కరించుకుని ఆదివారం బాలా త్రిపుర సుందరి సమేత అగస్త్యేశ్వర స్వామి వారికి మహా అన్నాభిషేకం నిర్వహించారు. ఉదయం విశేష అభిషేకాలు,అర్చనలు అనంతరం ఆలయప్రాంగణంలో వండివార్చిన అన్నాన్ని ఆలయ అర్చకులు విశ్వనాథ శర్మ,చిన్నశర్మలు స్వామివారికి అభిషేకించారు. స్వామి వారిని భక్తులు దర్శించుకున్నారు.అనంతరం అభిషేకించిన అన్నప్రసాదాన్ని భక్తులు స్వీకరించారు.ఏర్పాట్లను గ్రామ సభాపతి మంగళంపల్లి చంద్రశేఖర్ శాస్త్రి, నిర్వాహకకమిటీ సభ్యులు కొత్యల సుబ్బారాయుడు, యడ్ల వెంకటేష్, ఆలయ సిబ్బంది పర్యవేక్షించారు.



కరుణించు..కోటసత్తెమ్మ

నిడదవోలు,డిసెంబరు 01 (ఆంధ్రజ్యోతి) : కోటసత్తెమ్మ నీకు కోటి దండాలు అంటూ భక్తులు అమ్మవారి దర్శనానికి క్యూ కట్టారు. నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెం గ్రామంలో ఆదివారం కోటసత్తెమ్మను భక్తులు పెద్ద ఎత్తున దర్శించుకున్నారు. అమ్మవారికి ఉదయం సుప్రభాత సేవతో ప్రారంభమై ధూపహారతి, నిత్యార్చన, లలితా పారాయణం, సహస్రనామ కుంకుమ పూజలు చేశారు. అనంతరం అమ్మవారికి క్షీర నివేదన, మహానివేదన చేశారు. అనంతరం ప్రత్యేక పూల అలంకరణలో ఉన్న అమ్మవారిని భక్తులు దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

నేడు పీజీఆర్ఎస్

రాజమహేంద్రవరం రూరల్, డిసెంబర్ (ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కారవేదిక మీకోసం (పీజీఆర్ఎస్) సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరుగుతుందని కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంతో పాటు కొవ్వూరు,రాజమహేంద్రవరం డివిజన్‌ల పరిధిలో నిర్వ హిస్తారన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఉన్నతాధికారులు ప్రభుత్వాసుపత్రుల్లో ప్రసవాలు పెరగాలని ఆదేశాలిస్తుంటారు.. అయితే ఒక ప్రభుత్వ ఉద్యోగి ప్రసవానికి ప్రభుత్వాసుపత్రికి వెళితే తల్లిని క్షేమంగా ఇంటికి పంపలేకపోయారు. అయినా చర్యల్లేవ్.. రాజవొమ్మంగి మండలం కొండపల్లికి చెందిన చీరబోయిన వెంకటలక్ష్మి(34) అటవీశాఖలో గోకవరం రాణాదారుగా పనిచేస్తున్నారు. ఈ నెల 22న రాత్రి ప్రసవానికి గోకవరం ప్రభుత్వాస్పతికి వచ్చారు. శస్త్ర చికిత్స చేస్తుండగా మగబిడ్డకు జన్మనిచ్చి ఆమె కన్నుమూశారు. ఆమె గర్భవతిగా నిర్ధారణ అయిన నాటి నుంచీ రాజమహేంద్రవరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో పరీక్షలు చేయించుకున్నారు. అయితే ప్రసవానికి మాత్రం గోకవరం ప్రభుత్వాసుపత్రిలో చేరారు. పండంటి మగబిడ్డకు జన్మనిచ్చిన వెంకటలక్ష్మి ప్రసవ సమయంలో మృతిచెందడంపై వైద్యులు ఆశువుగా కారణాలు చెప్పేశారు. కానీ కళ్లు కూడా తెరవకముందే తన తల్లి శాశ్వతంగా కళ్లు మూయడంపై ఆ నవజాత పసోడికి ఎవరు సమాధానం చెబుతారు..?

గత నెలలో రాజమండ్రి రూరల్ మండలం రాజవోలు గ్రామానికి చెందిన కేతనకు ఏడో నెలలో ప్రసవ వేదన రావడంతో గోరక్షణపేట సమీపంలో కొత్తగా నిర్మించిన ఓ కార్పొరేట్ స్థాయి పిల్లల ఆస్పత్రిలో చేర్పించారు..అయితే మగబిడ్డ జన్మించాడు. ఆస్పత్రిలో ఉంచి చికిత్స అందించాలని వైద్యులు సూచించారు. దఫదఫాలుగా రూ.25 లక్షల వరకూ బిల్లు వేశారు. సుమారు రెండు నెలల పాటు చికిత్స సమయంలో తల్లిని మినహా చివరికి తండ్రి రమణను కూడా బిడ్డను చూడనివ్వలేదు. ఈ నెల 23 తెల్లవారుజామున 4గంటలకు నవజాత శిశువు మృతి చెందిందని వైద్యులు చెప్పడంతో ఆ కుటుంబం ఘొల్లుమంది. అప్పటికి సమర్పించినవి కాకుండా మరో రూ.3 లక్షలు చెల్లించి బిడ్డను తీసుకెళ్లాలని చెప్పడంతో బాధితులు హతాశులయ్యారు. ఆస్పత్రి వైద్యుల నిర్లక్ష్యం వల్లే తాము తీరని శోకంలో మునిగిపోయామంటూ బిడ్డ తల్లిదండ్రులు కలెక్టర్‌కి ఫిర్యాదు చేసే ఆలోచనలో ఉన్నారు.

జిల్లా పంచాయతీ అధికారి బొబ్బరాడ శ్రీనివాసరావు మరణం విషయంలో ఓ కార్పొరేట్ ఆస్పత్రి తీరుపై పెద్ద దుమారమే రేగుతోంది.ఆయన కుమార్తె, కొందరు గెజిటెడ్ అధికారులు ఏకంగా కలెక్టర్‌కి ఫిర్యాదు చేశారు. అక్టోబరు 16న రాత్రి మా నాన్నకు గుండెలో అసౌకర్యం ప్రారంభమైంది. వెంటనే రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా తీవ్రమైన పక్షవాతం వచ్చినట్టుగా ఈసీజీ ద్వారా నిర్ధారించి అత్యవసర వైద్యం అందించారు. ఆ వైద్యుల సూచనతో 17న తెల్లవారుజామున 2 గంటల ప్రాంతంలో డెల్టా ఆసుపత్రికి తీసుకెళ్లాం. అక్కడ తీవ్రమైన నిర్లక్ష్యం ప్రదర్శించారు. ఇది మా నాన్న మృతికి దారి తీసింది. అని జిల్లా పంచాయతీ అధికారి కుమార్తె కలెక్టర్‌కి చేసిన ఫిర్యాదులో ఉంది.దీనిపై కలెక్టర్ విచారణకు ఆదేశించారు..ఆ విచారణ తూతూ మంత్రంగా సాగినట్టు తెలిసింది. తమ తోటి అధికారి వైద్యుల నిర్లక్ష్యం కారణంగా చనిపోయారని ఫిర్యాదు చేసినా విచారణ జరిగిన తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఆసుపత్రులా.. అంపశయ్యలా!?



గోకవరం ఆసుపత్రి వద్ద అంబులెన్స్ ఎక్కిస్తున్న వెంకటలక్ష్మి మృతదేహం(ఫైల్)

- జిల్లాలో పెరిగిన మరణాల రేటు
- ప్రైవేటు ఆసుపత్రికి వెళితే బాదుడే
- ఇష్టానుసారంగా ఫీజులు
- లక్షలుంటేనే చికిత్స..లేదంటే అంతే
- ప్రాణాలు కోల్పోతున్న సామాన్యులు
- ప్రభుత్వాసుపత్రిలో 1200 మంది
- ప్రైవేటు ఆసుపత్రుల్లో 690 మంది
- ఇదీ 11 నెలల్లో మృతుల సంఖ్య
- పెరుగుతున్న వైద్యుల నిర్లక్ష్యం
- కొరవడిన అధికారుల పర్యవేక్షణ

వైద్యో..నారాయణో హరి..హరీ!

వైద్యో నారాయణో హరి.. అంటే వైద్యుడిని దేవుడిగా చూస్తాం.. ప్రస్తుతం వైద్యుల తీరు చూస్తుంటే హరి హరీ అనేలా ఉంది.. డబ్బులుంటేనే జబ్బు తగ్గుతుంది.. లేదంటే అంతే.. ఆసుపత్రులు అంపశయ్యల్లా మారాయి. రెండు నెలల బిడ్డకు రూ.7 లక్షల మందులు వాడినట్టు చెప్పి.. రూ. 25 లక్షల బిల్లు వేశారంటే కార్పొరేట్ ఆసుపత్రుల బాదుడు ఎంతలా ఉందో అర్థం చేసు కోవచ్చు.. అయినా బిడ్డను కాపాడగలిగారా అంటే అదీలేదు.. అధికారుల పర్యవేక్షణ కొరవడడం.. ప్రైవేటు ఆసుపత్రుల్లో ఫీజులపై నియంత్రణ లేకపోవడంతో ఇష్టాను సారంగా పిండేస్తున్నారు.. ఎమర్జెన్సీ ఆసుపత్రుల పేరిట వైద్యులు గ్రూపులుగా మారి లాగేస్తున్నారు. జిల్లా పంచాయతీ అధికారి వైద్యుల నిర్లక్ష్యం కారణంగా చనిపోయారంటూ కుటుంబీకులు ఘొల్లుమంటుంటే కనీస చర్యల్లేవ్.. ఇక సామాన్యుడు చూస్తూ ఉండడం తప్ప ఏం చేస్తాడు.. పోనీ అధికారం ఉన్నవారు ఏమైనా చేస్తున్నారా అంటే అదీలేదు.

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

భగవంతుడిని ఎంత నమ్మినా ఆరోగ్య విపత్కర సమయంలో 'వైద్యో నారాయణో హరిః' అంటూ వైద్యుడినే కొలుస్తాం. సాక్షాత్తూ భగవత్ రూపంగా చూస్తాం. కానీ ఇవాళ వైద్యంలో తరిగిపోతున్న విలువలు,వైద్యాలయాల కాసుల కక్కుర్తి వెరసి ప్రాణాలు గాలిలో దీపాలను తలపిస్తున్నాయి. కాపాడాల్సిన చేతులే కాటికి పంపేస్తున్నాయి. పోయేది ఒక ప్రాణమే అయినా.. ఆ ప్రాణంతో ముడిపడి ఉన్న ఎన్నో ప్రాణాలు జీవచ్ఛవాలు అయిపోతున్నాయి. అప్పుడే పుట్టిన బిడ్డకు రెండు నెలలకు ఏకంగా రూ.7లక్షల మందులు వాడేసినట్టు ఇటీవల ఓ కార్పొరేటు ఆస్పత్రి బిల్లు వేసిందంటే యంత్రాంగం ఎంత కళ్లు మూసుకుందో అర్థం చేసుకోవచ్చు. వైద్యం వికటిస్తుండడంపై బాధితులు ఏకంగా జిల్లా బాస్ అయిన కలెక్టర్‌ని ఆశ్రయిస్తుండడం తీవ్రతకు అద్దం పడుతోంది. కేవలం 11 నెలల్లో జిల్లా కేంద్రంలోని ప్రైవేటు/కార్పొరేటు, ప్రభుత్వాస్పత్రుల నుంచి 2 వేల మందిని కాటికి పంపారనే నిజం కలచివేస్తోంది. బాధితులు ఆస్పత్రి సిబ్బందిని గట్టిగా నిలదీస్తే జైలుకు వెళతారనే బోర్డులు ఉంటున్నాయే గానీ ఆస్పత్రి విధులు, బాధ్యతలపై ఎక్కడా ఒక్క అక్షరం కూడా కనబడదు. మరో వైపు అధికారులు హెచ్చరికలకే పరిమితం అవుతున్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలోని ఆస్పత్రుల తీరుపై 'ఆంధ్రజ్యోతి' పరిశోధనాత్మక కథనం.

ప్రభుత్వాసుపత్రికెళితే..

నిత్యం జిల్లా సమగ్ర ఆస్పత్రికి ఓపీ 900-1200, ఇన్‌పేషెంట్ల సంఖ్య 80-100 వరకూ ఉంటోంది. రోజుకు కనిష్ఠంగా ఇద్దరు, గరిష్ఠంగా ఐదుగురు.. నెలకు సరాసరిన 100 మంది చనిపోతున్నారు. ఎక్కువగా పక్షవాతం, శ్వాస, ఊపిరి తిత్తులు, లివర్ సమస్యలు, ఆకస్మికంగా గుండె పనితీరు మందగించడం, రోడ్డు ప్రమాదాల కేసుల్లో ఎక్కువగా మరణాలు సంభవిస్తున్నాయి. ఈ ఆస్పత్రి బోధనాస్పత్రి స్థాయికి చేరుకున్నా చిత్రమైన పరిస్థితులు వెంటాడుతూనే ఉన్నాయి. వైద్యులు ఉన్నా పరికరాల కొరత వేధిస్తోంది.ఈ ఆస్పత్రికి ఎక్కువగా ప్రమాదాల కేసులు వస్తుంటాయి. నరాలు, మెదడు సంబంధిత వైద్యుల అవసరత ఉంటుంది. అయితే ముగ్గురు న్యూరో సర్జన్లు ఉన్నా ఎక్విప్‌మెంట్ లేకపోవడంతో చికిత్స అందించలేకపోతున్నారు.

తక్షణమే కాయకల్ప చేయాల్సిందే!

జిల్లాలో పదుల్లో కార్పొరేట్, వందల్లో ప్రైవేటు ఆస్పత్రులు, ల్యాబొరేటరీలు, చిన్నపాటి క్లినిక్‌లు ఉన్నాయి. వీటిలో అధికశాతం జిల్లా కేంద్రమైన రాజమహేంద్రవరంలోనే ఉన్నాయి. ఇక్కడి ప్రభుత్వాస్పత్రికి ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల నుంచీ వైద్యానికి వస్తుంటారు. కార్పొరేట్/ప్రైవేటు ఆస్పత్రులు కాసుల కక్కుర్తిలో పడిపోయి వైద్యానికి తిలోదకాలు ఇస్తుంటే.. ప్రభుత్వాస్పత్రుల్లో పరికరాల కొరత, సమయానికి ఆయా డాక్టర్లు అందుబాటులో లేకపోవడం ప్రాణాలను తీస్తోంది. మెడికల్ కళాశాల స్థాయికి జిల్లా సమగ్ర ఆస్పత్రి అభివృద్ధి చెందినా ఇప్పటికీ రోగులను సంబంధీకులే మోసుకెళ్లి మంచంపై వేసే దుస్థితిని రోజూ చూడొచ్చు. ఇక ప్రైవేటు/కార్పొరేటు ఆస్పత్రుల గురించి ఎంత తక్కువ చెప్పుకుంటే అంత మంచిది.అన్నీ అలాగే లేకపోయినా.. అధిక శాతం ఆస్పత్రులు రోగుల్లో డబ్బును చూస్తున్నాయి.మా దగ్గరకు వందలాది మంది రోగులు వస్తుంటారు..ఆ మాత్రం ప్రాణాలు పోవడం పెద్ద తప్పేమీ కాదని ఓ కార్పొరేట్ ఆస్పత్రి వర్గాలు మాట్లాడడం విని వైద్య విలువలు తల దించుకుంటున్నాయి. చివరికి గోల్డెన్ అవర్‌లో చికిత్సపై కూడా తీవ్ర నిర్లక్ష్యం కనబడుతోందనే ఆరోపణలు ఉన్నాయి. గుండె నొప్పి వస్తే బీపీ నిపుణుడితో వైద్యం చేయించే ఘనులూ ఉన్నారు. ప్రైవేటు ఆస్పత్రులకు అత్యవసర సమయంలో రోగిని తీసుకెళ్తుంటే.. వారి బంధువులు ఆస్పత్రుల చేతుల్లో లక్షలు పెట్టడం కోసం బయట అప్పులకు తిరుగుతున్న దయనీయ సందర్భాలు కానవస్తున్నాయి. వైద్య యంత్రాంగానికి తక్షణ కాయకల్ప చికిత్స అవసరమని ఈ పరిస్థితులు చెబుతున్నాయి.ఏ ఘటన జరిగినా నాటకీయ విచారణలు జరపడం, ఆ నివేదికలు బయటకు రాకపోవడం,ఎవరిపైనా చర్యలు తీసుకున్న దాఖలాలు లేకపోవడం చూస్తూ విస్తుపోతున్నాయి. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు/కార్పొరేట్ ఆస్పత్రుల్లో మరణాలపై ప్రభుత్వం విచార ణకు ఉపక్రమించాలని బాధిత కుటుంబాలు కోరుతున్నాయి.

ఈ నేపథ్యంలో అత్యవసరమైనా కాకినాడ రిఫర్ చేస్తున్నారు. వీరిలో అధిక శాతం మంది దారి మధ్యలోనే చనిపోతున్నారు. సుమారు రూ.కోటి ఖర్చయ్యే ఈ పరికరాలు/యంత్రాల కోసం ప్రైవేటు సంస్థలను అభ్యర్థిస్తున్నారు.అత్య వసర వైద్య విభాగాన్ని ఒక అసి స్టెంట్ ప్రొఫె సర్‌తో నెట్టుకొస్తున్నారు. ప్రైవేటు ఆస్పత్రుల వైకల్యాలను పట్టించుకునే నాథుడే కానరావడం లేదు. ధరల పట్టికలు ఉండవు. మందుల్లోనూ మతలబు చేస్తుంటారు.నవజాత శిశువును వైద్యం పేరిట రెండు నెలలు ఉంచిన ఒక ప్రైవేటు ఆస్పత్రి సర్వీసు పేరుతో రూ.94 వేలు, ప్యాకేజీ అంటూ రూ.2.5 లక్షలు, వైద్యుల కన్సల్టెన్సీ రూ.65 వేలు,మందులకు ఏకంగా రూ.7 లక్షలు ఇతర ఖర్చులు వెరసి రూ.25 లక్షలు లాగేశారు. ఇంతా చేసి నిర్జీవ బిడ్డను చేతిలో పెట్టారు. ఇది ఒక్క ఉదాహరణ మాత్రమే.

11 నెలలు.. 2 వేల మంది..

ప్రైవేటు/కార్పొరేటు ఆస్పత్రుల్లో ఈ జనవరి నుంచి నవంబరు వరకూ సంభవించిన మరణాల గణాంకాలను చూస్తే.. కిమ్స్ 189, డెల్టా 66, సాయి 35, జీఎస్ఎల్ ట్రస్ట్ 39, స్వతంత్ర 35, అభయ 8, అపెక్స్ 14, ఫస్ట్ ప్లస్ 35, సన్‌స్టార్ 17, సురక్షా 20, కిపీ 8, మాగ్నా 9, తేలత్ 11, విజన్ 47, కమలాకర్ 12, రాజు న్యూరో 39, శ్రీ ఆదిత్య 12, సిద్ధార్థ 8, స్మార్ట్ 15, నవీన్, సిద్ధార్థ చిల్డ్రన్, శ్రీ సాయి దుర్గా, అన్నపూర్ణ, హెల్త్, హీలియోస్, జూపి టర్, నెస్ట్, శ్రీ రవి, శ్రీ సాగర్, సెయింట్ జోసెఫ్, చక్రధర్, నీఆజీయర్, బ్లూసమ్స్ సాయి, మాధవి, రాజాలో ఒక్కరు చొప్పున, కిపీ, ఆరోగ్య, ఏఆర్‌కే, భాస్కరరాజు, గాంధీ, జయత్రి, నవీన్, సహజ ఆస్పత్రులో ఇద్దరేసి, రాజు న్యూరో, ప్రైమ్, ఆర్ఎస్ న్యూరో, వాసవి శ్రీ, సౌభాగ్య, వరుణ్‌లో ముగ్గురు చొప్పున, మహాలో నలుగురు, స్వామి వైద్యాలయ, రవి చైతన్యవిజయ్ ఆస్పత్రిలో ఐదుగురు చొప్పున ప్రాణాలు కోల్పోయారు.మొత్తంగా 11 నెలల్లో ప్రభుత్వాస్పత్రిలో 1200 మంది, ప్రైవేటు ఆస్పత్రుల్లో 690 మంది చనిపోయారు. ఇలా ఆసుపత్రులు అంపశయ్యల్లా మారాయి.

వీడని ముసురు

- మారిన వాతావరణం
- కళ్లాల్లో 2103 మెట్రిక్ టన్నులు
- అన్నదాతల్లో ఆందోళన
- నేడు తరలించేందుకు చర్యలు
- చేలల్లోనే 35 శాతం పంట
- జిల్లా వ్యాప్తంగా పెరిగిన చలి

రాజమహేంద్రవరం/గోపాలపురం,డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి) : ముసురు వీడలేదు. అన్నదాతల్లో ఆందోళన ఆగలేదు.. ఆకాశంలో మార్పులు ధాన్యం రైతులకు రెండో రోజు కంటి మీద కునుకులేకుండా చేశాయి.గత రెండు రోజులుగా తుఫాన్ ప్రకటనలు రైతుల గుండెల మీద కుంపటిలా తయారయ్యాయి. రేయింబవళ్లు కష్టించి పండించిన పంట చేతికొచ్చే సమయంలో అటు పొగాకు, ఇటు ధాన్యం రైతులు ఆందోళన చెందుతున్నారు. తుఫాన్లతో ఇప్పటికే కోసిన పంట రోడ్లపై టార్పాలిన్లు కప్పిన రైతులు ఏ సమయంలో ఎటు నుంచి ప్రమాదం ముంచుకొస్తుందోనని కంటి మీద కునుకులేకుండా క్షణక్షణం భయంభయంగా గడుపుతున్నారు. పొగాకు రైతులు కారుమబ్బుల కారణంగా మొక్కలకు చీడపీడలు ఆశిస్తాయనే భయంతో దిగాలుగా చూస్తున్నారు.ఆదివారం ఉదయం నుంచి ఆకాశం మబ్బుగా ఉంది.. దీంతో రైతులు కోతలకు ధైర్యం చేయలేదు.జిల్లాలో ఇంకా 35 శాతం వరికోతలు జరగాల్సి ఉంది. అధికారుల సూచనల మేరకు నిలిపివేశారు. కళ్లాల్లో ఉన్న ధాన్యాన్ని మిల్లులకు తరలించే పనిలో రైతులు,అధికారులు నిమగ్నమయ్యారు. శనివారం నాటికి కళ్లాల్లో 30 వేల మెట్రిక్ టన్నులు ఉంటే ఆదివారం నాటికి ఈ సంఖ్యను 2103 మెట్రిక్ టన్నులకు తగ్గించారు. సోమవారం నాటికి మొత్తం ధాన్యం మిల్లులకు తరలించే ప్రయత్నం చేస్తున్నట్టు జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు తెలిపారు. 410 మెట్రిక్ టన్నుల వరి పంట కుప్పల రూపంలో ఉందన్నారు. జిల్లాలో కోరుకొండ మండలంలో 80 మెట్రిక్ టన్నులు,గోకవరంలో 503, సీతాన గరంలో 350, దేవరపల్లిలో 100, గోపాలపురంలో 230, కొవ్వూరులో 50, నిడదవోలులో 85, పెర వలిలో 150, తాళ్లపూడిలో 400, ఉండ్రాజవరంలో 100, నల్లజర్లలో 55 మెట్రిక్ టన్నుల ధాన్యం కళ్లా ల్లో ఉంది. ధాన్యాన్ని సోమవారం మిల్లులకు తరలిస్తామని అధికారులు చెబుతున్నారు.



గోపాలపురం: బస్తాల్లోకి ఎత్తి ధాన్యం తరలింపు

పెరిగిన చలి తీవ్రత

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో రాజమహేంద్రవరం జిల్లావ్యాప్తంగా వర్షం కురిసింది. ఆదివారం తెల్లవారుజాము నుంచి రాజమహేంద్రవరం, రూ రల్,రాజానగరం, కోరుకొండ, సీతానగరం ప్రాం తాల్లో జల్లులతో కూడిన వర్షం కురిసింది. ఆది వారం ఉదయం నుంచి కొన్ని ప్రాంతాల్లో తుంపర్లగా వాన కురిసింది. మధ్యాహ్నం నుంచి జల్లులుగా పడింది. శీతాకాలం కావడంతో చలి తీవ్రతకు వాన తోడుకావడంతో వాతావరణం పూర్తిగా చల్లబడిపోయింది. రాజమహేంద్రవరంలో ఆదివా రం ఉష్ణోగ్రత 24 డిగ్రీలుగా నమోదైంది.



వెరీ..గుడ్!

కార్తీకమాసమైనా ఎక్కడా గుడ్డు ధర దిగిరాలేదు.. పెరుగుతూనే ఉంది.. డిమాండ్‌కు తగినట్టు ఉత్పత్తి లేకపోవడంతో అంతకంతకూ పెరుగుతూనే ఉంది.. గతంలో ఉభయగోదావరి జిల్లాలు పౌల్ట్రీ పరిశ్రమకు పెట్టింది పేరు.. రాను రాను నష్టాలు రావడంతో కోళ్లను తగ్గించుకుంటూ వచ్చారు.. దీంతో ప్రస్తుతం ఉత్పత్తి పడిపోయి ధర పెరుగుతోంది. ఒక్కో గుడ్డు పౌల్ట్రీ వద్ద రూ.6.08 పైసలు పలుకుతోంది. -8లో



వైసీపీ ప్రభుత్వంలో మట్టి తరలించిన పోలవరం గట్టు వద్ద సర్పంచ్ గద్దే తిలక్ వర్గీయుల ఆందోళన

పోలవరం కుడి కాల్వ గట్టు గుల్ల

నాడు వైసీపీ నాయకుల తీరుపై శింగరాజుపాలెంలో సర్పంచ్ నిరసన

నల్లజర్ల, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ ప్రభుత్వంలోనే పోలవరం కుడి కాల్వ గట్టును వైసీపీ నాయకులు కొల్లగొట్టారని శింగరాజుపాలెం జనసేన సర్పంచ్ గద్దె బాలగంగధర్ తిలక్ అన్నారు. నల్లజర్ల మండలం శింగరాజుపాలెంలో వైసీపీ ప్రభుత్వంలో 10 ఎకరాల పోలవరం కుడి కాల్వ గట్టును త్రవ్విన ప్రదేశంలో ఆదివారం జనసేన నాయకులు,కార్యకర్తలు ఆందోళన చేశారు.శింగరాజుపాలెం గ్రామానికి చెందిన ఒక వ్యక్తి నకిలీ పర్మిట్ చూపిస్తూ పోలవరం కుడి కాల్వ గట్టు మట్టిని గుండుగొలను-కొవ్వూరు హైవే అధికారులకు విక్రయించారని ఆరోపించారు. అనంతపల్లి నుంచి శింగరాజుపాలెం వరకు పోలవరం కుడి కాల్వ గట్టును నేల మట్టం చేసి అందులో వ్యవసాయం చేస్తున్నారని ఆరోపించారు.విజిలెన్స్ అధికారులు పోలవరం కుడి కాల్వ గట్టును సర్వే చేసి వైసీపీ నాయకులు తరలించిన మట్టిని గుర్తించి పోలవరం కుడి కాల్వ గట్టును పటిష్టం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన అధ్యక్షులు దొండపాటి బాబు, కేశవరావు, అనపర్తి మునలయ్య,గారపాటి వెంకటేశ్వరరావు, అలం మహేశ్,అనిల్ పాల్గొన్నారు.

కొవ్వూరు
• కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

ఘనంగా శివపార్వతుల కల్యాణం


ప్రక్కిలంకలో శివ పార్వతుల కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

తాళ్లపూడి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలో పలు గ్రామాల్లో ఉన్న శివాలయాల్లో శివపార్వతుల కల్యాణాలు వైభవంగా నిర్వహించారు. తాళ్లపూడిలోని పార్వతీ సహిత ఉమాపరమేశ్వర ఆలయంలో అర్చకులు శివునికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ప్రక్కిలంక గ్రామంలో అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి ఆలయంలో ఆలయ అర్చకులు శివపార్వతుల కల్యాణం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. బల్లిపాడులోని విశ్వేశ్వరస్వామి ఆలయంలో ఆలయ అర్చకులు లక్షపత్రి పూజ నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ముప్పిడిని కలిసిన శ్రీనివాసరావు


ఎమ్మెల్యే ముప్పిడి, పెండ్యా అచ్చిబాబుతో శ్రీనివాసరావు

చాగల్లు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): టీడీపీ నాయకుడు గారపాటి శ్రీనివాసరావు.. ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, పార్టీ సీనియర్ నాయకుడు పెండ్యాల అచ్చిబాబులను కొవ్వూరులోని పార్టీ కార్యాలయంలో కలిసినట్టు ఆదివారం చెప్పారు. కాగా శ్రీనివాసరావు ఇటీవల మాజీ ప్రభుత్వ సలహాదారుడు రాజీవ్‌కృష్ణతో కలిసి టీడీపీలో చేరారు. కార్యక్రమంలో జడ్పీటీ సీ బొంత వెంకటలక్ష్మి, ధర్మవరం ఎంపీటీసీ కోమలి, ముళ్లపూడి కాశి, యు.రాజాబాబు పాల్గొన్నారు.

కార్యకర్తలు బలంగా ఉంటేనే పార్టీకి బలం

వైసీపీ నాయకులు


సమావేశంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే తలారి

చాగల్లు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): కార్యకర్తలు బలంగా ఉంటేనే పార్టీ పటిష్టంగా ఉంటుందని వైసీపీ నాయకులు అన్నారు. ఆదివారం స్థానిక శ్రీకృష్ణదేవరాయ కళ్యాణమండపంలో జరిగిన వైసీపీ మండల సమావేశంలో ఎంపీపీ మట్టా వీరాస్వామి సహా పలువురు నాయకులు మాట్లాడారు. వలంటీర్లకు విలువనిచ్చి పార్టీ నాయకులు, కార్యకర్తలను నిర్లక్ష్యం చేశారని ఆవేదన వ్యక్తంచేశారు. భవిష్యత్‌లో అటువంటి తప్పులు జరక్కుండా చూడాలన్నారు. మాజీ ఎమ్మెల్యే తలారి వెంకటరావు మాట్లాడుతూ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ జిల్లాల్లో పర్యటించి కార్యకర్తలను కలుస్తారని, పార్టీ అండగా ఉంటుందని చెప్పారు. పార్టీని బలోపేతం చేయడానికి కృషి చేయాలన్నారు. సమావేశంలో పార్టీ కన్వీనర్ చెల్లింకుల దుర్గామల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ అభ్యర్థికి మద్దతుగా ప్రచారం


ప్రచారంలో పాల్గొన్న ఏపీటీఎఫ్ నాయకులు

తాళ్లపూడి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఏపీటీఎఫ్ బలపరిచిన స్వతంత్ర అభ్యర్థి గంధం నారాయణరావుకు మద్దతుగా మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు దున్నా దుర్గారావు కోరారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ డిసెంబరు 5న జరిగే టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికలలో మండ లంలో 61 మంది ఓటర్లు ఉన్నారని వారందరూ కలిసి నారాయణరావు గెలుపునకు కృషి చేస్తారన్నారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు రాజశేఖర్, వీరాస్వామి, నాని తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సత్కారం


షేక్ బాబ్జి, మస్తాన్‌బీబీ దంపతులను సత్కరిస్తున్న దృశ్యం

ఉండ్రాజవరం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఉండ్రాజవరం బౌద్ధధమ్మ పీఠంలో పీఠాధిపతి అనాలయో తండ్రి షేక్ బాబ్జి షష్టిపూర్తి, తల్లి షేక్ మస్తాన్‌బీబీ పదవి విరమణ సన్మాన కార్యక్రమాలు ఆది వారం నిర్వహించారు. ఈ సందర్భంగా బౌద్ధ ఆశ్రమ అధిపతి అనాలయో మాట్లాడుతూ తలిదండ్రుల శేష జీవితాలు ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. ఇద్దరు ఉపాధ్యాయుల కుమారుడైన అనాలయో బౌద్ధ ధర్మాన్ని వ్యాప్తి చేసేందుకు ఆశ్రమం ఏర్పాటు చేయడం ముదావహమని పలువురు ఉపాధ్యాయులు పేర్కొన్నారు. కార్యక్రమంలో పలు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

నగర సంకీర్తన


నగర సంకీర్తనలో పాల్గొన్న ఇస్కాన్ ప్రతినిధులు

తాళ్లపూడి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం సందర్భంగా రాజమహేంద్రవరం ఇస్కాన్ ఆధ్వర్యంలో ఆదివారం తాళ్లపూడిలోని రుక్మిణీ సత్యభామా సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో భజన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం తాళ్లపూడి మరియు ప్రక్కిలంక గ్రామాలలో ఇస్కాన్ ప్రముఖులు శ్యామాంగ శ్రీనివాసదాస ప్రభు, శివానంద నిమయ్‌దాస్ ఆధ్వర్యంలో హరినామ మహా నగర సంకీర్తన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వ్యక్తిపై బీరు బాటిల్‌తో దాడి

ఇద్దరిపై కేసు

కొవ్వూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): వ్యక్తిని తలపై బీరు బాటిల్‌తో కొట్టి గాయపర్చిన ఇరువురిపై కేసు నమోదు చేసినట్టు కొవ్వూరు పట్టణ హెడ్ కానిస్టేబుల్ ఆర్.సత్యనారాయణ తెలిపారు. కొవ్వూరు మండలం దొమ్మేరు గ్రామానికి చెందిన కాటూరి వెంకటేష్ లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం మధ్యాహ్నం 3గంటలకు గ్రామంలోని దుర్గమ్మ గుడి సమీపంలో చేపలు కొనుగోలు చేయడానికి వెళ్లాడు. అదే సమయంలో మారి, ఫణిలు అక్కడికి రాగా వెంకటేష్ వాహనం అడ్డుగా ఉంది. దీంతో ఇరువురి మధ్య ఘర్షణ జరగ్గా స్థానికులు సముదాయించి వెంకటేష్‌ను పంపించేశారు. కొద్దిసేపటి తరువాత మారి, ఫణి ఇంటికి వచ్చి వెంకటేష్‌తో ఘర్షణపడి,కిందపడవేసి దాడిచేసి బీరు బాటిల్‌తో తలపై కొట్టారు.తల, కడుపు, ఛాతీపై గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆసుపత్రి సమాచారం మేరకు వెంకటేష్ ఫిర్యాదుపై కేసునమోదు చేసినట్టు హెచ్‌సీ తెలిపారు.

అలరించిన తులసీనాథ్ గాత్రకచేరి


సంగీత నీరాజనం కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న జేసీ చినరాముడు

రాజమహేంద్రవరం కల్చరల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): వెంకటేశ్వర ఆనం కళాకేంద్రంలో ఆదివారం సాయంత్రం విదుషీమణి తులసీనాథ్ గాత్ర కచేరీ,సంగీత నృత్య కార్యక్రమాలు ప్రేక్షకులను అలరించాయి. భారత ప్రభుత్వ పర్యాటక సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని జేసీ ఎస్.చిన రాముడు ప్రారంభించారు. అనంతరం విదుషీమణి తులసీనాథ్ గాత్రం,పెరవలి నందకుమార్ వయోలిన్,మండపాక రవి మృదంగ సహకారంతో శ్రోతలను పరవశింపజేశారు. విద్యార్థుల సంగీతనృత్య ప్రదర్శనలతో ప్రేక్షకులను పరవశింపజేశారు.ఎం.నరసింహారావు ప్రార్థనా గీతం ఆలపించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర సంగీత నాటక అకాడమి సభ్యులు సత్యనారాయణ, కేంద్ర సాంస్కృతిక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ప్రవీణ్‌కుమార్, టూరిజం ప్రాంతీయ సంచాలకులు వెంకటాచలం, విజయ శంకర నృత్య పాఠశాల ప్రిన్సిపాల్ ఎంనాగలక్ష్మి,ఎన్‌శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వెరీ‘గుడ్డు’



- కోడి గుడ్డు అధరహో
- ఫారం వద్ద రూ.6.08 పైసలు
- బహిరంగ మార్కెట్‌లో రూ.7లు
- ఉత్పత్తి తగ్గడమే కారణం

అనపర్తి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): దాణా రేట్లు, నిర్వహణా ఖర్చులు గణనీయంగా పెరగడంతో రెండేళ్లుగా కోళ్ల పరిశ్రమ నష్టాల్లో నడిచింది. ప్రస్తుతం గుడ్డు ధర రూ.6.08 పైసలకు పెరగడంతో రైతులు కొంత మేర ఊపిరి పీల్చుకుంటున్నారు. 15 నుంచి 20 రోజులుగా ఈ ధర అటు ఇటుగా ఉన్నప్పటికీ డిసెంబరు నెలాఖరు వరకూ కొనసాగితే రైతుకు కొంత మేర ప్రయోజనం చేకూరుతోంది. గోదావరి జిల్లాల్లో పెద్ద చిన్న ఫారాలు సుమారుగా 300నుంచి 350 వరకు ఉన్నాయి. వీటిలో సుమారుగా 1.5 కోట్ల కోళ్లు ఉన్నాయి. వీటి ద్వారా రోజుకు సుమారు 1 కోటి వరకు ఉత్పత్తి అవుతుండగా వీటిలో 40శాతం వరకు స్థానిక అవసరాలకు వినియోగిస్తుండగా మిగిలిన వాటిని విదేశాలకు ఎగుమతి చేస్తున్నారు. నెక్ ధర రూ.6.08పైసలు ఉన్నప్పటికీ ట్రేడర్లు ఈ ధరకు రూ.0.25 పైసలు తగ్గించి కొంటున్నారు. మరో 2శాతం కమిషన్ రూపంలో పోవడంతో రైతుకు 5.80పైసలు మాత్రమే అందుతుంది. అయితే పేపర్ రేటు ఎక్కువగా ఉండడంతో రిటైల్ మార్కెట్‌లో వినియోగదారుడు మాత్రం రూ.7. వెచ్చించి గుడ్డును కొనుగోలు చేస్తున్నాడు.


అనపర్తిలో కోళ్ల ఫారం

అయితే దేశం మొత్తం పంజాబ్ మార్కెట్‌పై ఆధార పడి ఉంటుందని, అక్కడ ధర ఉన్నంత వరకే ఇక్కడ ధర ఉంటుందని, ఎన్ని రోజుల పాటు ఈ ధర నిలబడుతుంతో చెప్పలేమని రైతులు చెబుతున్నారు.రెండు మూడేళ్లలో బ్యాచ్‌ల సంఖ్య గణనీయంగా తగ్గించడంతో ఉభయ గోదావరి జిల్లాల్లో ఉత్పత్తి తగ్గుముఖం పట్టింది. గుడ్డు తయారీకి సుమారుగా రూ.5 వరకు ఖర్చు అవుతుందని అయితే ఏడాదిలో కనీసం రెండు మూడు నెలలు గిట్టుబాటు ధర ఉండడం లేదని, మిగిలిన తొమ్మిది మాసాల్లో నష్టాలు చవి చూస్తున్నామని రైతులు అంటున్నారు. దీనికి తోడు నూకలు, మొక్కజొన్నలు దొరడంలేదని, దొరికినా కొనలేని స్థితిలో ఉన్నామని వాపోతున్నారు. గతంలో టీడీపీ అధికారంలో ఉండగా అనేక రాయితీలు అందేవని, ఐదేళ్ల వైసీపీ పాలనలో ఒక్క రాయితీ కూడా లేకుండా చేశారని, ప్రస్తుతం కూటమి ప్రభుత్వం కనీసం నూకలు, మొక్కజొన్న రాయితీ ధరకు అందిస్తే పరిశ్రమ మనుగడ సాగిస్తుందని రైతులు కోరుతున్నారు.

6న అంబేడ్కర్ వర్ధంతి

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ 68వ వర్ధంతి కార్యక్రమాలకు సంబంధించిన కరపత్రాన్ని ఆదివారం రాజమహేంద్రవరంలో ఆవిష్కరించారు. కార్పొరేషన్ కార్యాలయం ఎదురుగా అంబేడ్కర్ విగ్రహం వద్ద ఈ నెల 6న ఆయన వర్ధంతి నిర్వహిస్తామని ఎస్సీ ఎస్టీ సంఘాల నాయకులు కోరుకొండ చిరంజీవి, తాళ్లూరి బాబు రాజేంద్రప్రసాద్ తెలిపారు.

ఎయిడ్స్ నిర్మూలన అందరి బాధ్యత

- రాష్ట్ర పర్యాటక శాఖా మంత్రి కందుల దుర్గేష్
- ప్రపంచ ఎయిడ్స్ నివారణా దినం


నిడదవోలు సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి దుర్గేష్

నిడదవోలు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఎయిడ్స్ నిర్మూలన సమాజంలో ప్రతి ఒక్కరి బాధ్యత అని రాష్ట్ర పర్యాటక శాఖా మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ నివారణా దినం సందర్భంగా ఆదివారం నిడదవోలులోని లయన్స్ వృద్ధాశ్రమంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఎయిడ్స్ బాధితులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఎయిడ్స్ బాధితులను సమాజం చిన్నచూపు చూడకుండా వారిలో మనోధైర్యాన్ని పెంపొందించాలన్నారు. హెచ్ఐవీ సోకినంత మాత్రాన ఎయిడ్స్ రాదని, సోకినా కూడా తగిన జాగ్రత్తలతో మందులు వాడితే చాలాకాలం ఎయిడ్స్ బారిన పడకుండా కాపాడుకోవచ్చునన్నారు. అనంతరం ఎయిడ్స్ బాధితులకు నిర్వహించిన అన్నదానంలో మంత్రి పాల్గొని స్వయంగా వడ్డించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ భూపతి ఆదినారాయణ, బండి వెంకటేశ్వరరావు, కొమ్మిన వెంకటేశ్వరరావు తదితర్లు పాల్గొన్నారు.

కొవ్వూరు: స్థానిక ప్రభుత్వాసుపత్రిలో జరిగిన అవగాహన సదస్సులో సూపరింటెండెంట్ డాక్టర్ కె.సాయికిరణ్ మాట్లాడుతూ ఎయిడ్స్ నిర్మూలనకు ప్రతిఒక్కరూ పాటుపడాలన్నారు. అనంతరం ఆసుపత్రి నుంచి ప్లకార్డులతో ప్రభుత్వ, ఏబీఎన్ డిగ్రీ కళాశాలల విద్యార్థులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. విజయవిహార్ సెంటర్‌లో మానవహారంగా ఏర్పడి విద్యార్థులతో ఎయిడ్స్ ప్రతిజ్ఞ చేయించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జె.సునీత మాట్లాడుతూ విద్యార్థులు ఎయిడ్స్‌పై అవగాహన కల్పించుకుని సమాజాన్ని చైతన్యం చేయాలన్నారు. ఎయిడ్స్ నియంత్రణపై డాక్టర్ సాయికిరణ్ విద్యార్థులకు అవగాహన కల్పించారు.కార్యక్రమంలో డాక్టర్ సుభాషిణి, స్టాఫ్ నర్సులు రాధిక, నవీన, లాబ్ టెక్నీషియన్ వి.దుర్గాప్రసాద్, జీఎస్ సత్యనారాయణ, లయన్స్‌క్లబ్, సత్యసాయి సేవ సమితి సభ్యులు పాల్గొన్నారు.



కొవ్వూరులో ర్యాలీ నిర్వహిస్తున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు

సందడిగా కార్తీక వన సమారాధనలు


కొవ్వూరులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముప్పిడి

కొవ్వూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : కొవ్వూరు పట్టణ, మండలంలో కార్తీక వన సమారాధనలు ఆదివారం సందడిగా జరిగాయి. స్థానిక ఔరంగాబాద్‌లో గౌడ సంఘం సభ్యులు కుటుంబీకులతో ఆత్మీయంగా కలుసుకుని ఉల్లాసంగా గడిపారు. వేములూరు దీప్తి స్కూల్ సమీపంలో దికొవ్వూరు టెంట్‌హౌస్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కాగిత కోటేశ్వరరావు (కోటి) అధ్యక్షతన, స్థానిక బొమ్మిరెడ్డి మార్తాండ్ తోటలో ప్రెసిడెంటు పేరాబత్తిని శివప్రసాద్ ఆధ్వర్యంలో శ్రీ శివానంద మహర్షి వాకర్స్ క్లబ్ సభ్యులు వన సమారాధనలు జరిగాయి. వాకర్స్ సభ్యులు వాకలపూడి కొండలరావు, ఎస్ఆర్‌కె రాజు, పరిమి వెంకట్రావు పాల్గొన్నారు. నందమూరు రోడ్‌లో శ్రీ సీతారామ తూర్పు కాపు విద్యా విజ్ఞాన అభివృద్ధి సంఘం ఆధ్వర్యంలో వన సమారాధన నిర్వహించారు. కార్యక్రమాల్లో ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, ద్విసభ్య కమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, కంటమణి రామకృష్ణారావు, అర్బన్ బ్యాంకు ఛైర్మన్ మద్దిపట్ల శివరామకృష్ణ, మున్సిపల్ ఛైర్మన్ బావన రత్నకుమారి, సూరపనేని చిన్న, సూర్యదేవర రంజిత్, మద్దిపట్ల సురేష్ పాల్గొని ప్రసంగించారు.

కాపు సంఘం ఆధ్వర్యంలో..

నల్లజర్ల, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): నల్లజర్లలో ఉన్నమట్ల సత్యకిరణ్, గుండుమోగుల సోమేశ్వరావు(సోము)ఆధ్వర్యంలో నిర్వహించిన కాపుల కార్తీక వన సమారాధనకు న్యాయవాది, కాపు సంఘం తాడేపల్లిగూడెం టౌన్ ప్రెసిడెంట్ మకా శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. కాపు విద్యార్థుల కోసం రూ.2 కోట్లతో విద్యా నిధిని ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా చిన్నారులకు, మహిళలకు పలు పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. కార్యక్రమంలో బాడిత నాగేశ్వరరావు, కాపు సంఘం మండలాధ్యక్షుడు కందుల రవిశేఖర్,తాడికొండ బాబి, సిరంశెట్టి ప్రసన్నకుమార్, అగ్గిరాజు, ఉన్నమట్ల వెంకటేశ్వరరావు, రామకృష్ణ, హరి పాల్గొన్నారు.


నల్లజర్లలో మాట్లాడుతున్న మాకా శ్రీనివాస్

దుర్గామల్లేశ్వరస్వామి ఆలయంలో..

దేవరపల్లి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని పల్లంట్లలో దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో వనసమారాధన నిర్వహించారు. ఆలయార్చకులు ఉసిరిచెట్టు వద్ద లక్ష్మీనారాయణ పూజ, గోపూజ, జరిపారు. టీడీపీ నాయకుడు కొయ్యలమూడి చినబాబు, సుధారాణి దంపతులు పూజా కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం గోపూజ నిర్వహించి గోప్రదక్షిణ చేశారు. తదుపరి జరిగిన అన్నసమారాధనలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ ఛైర్మన్ గన్నమని జనార్దనరావు, ఆలయ కమిటీ సభ్యులు బలుసు సత్యనారాయణ, విజయలక్ష్మి దంపతులు, ఈదుగంటి శివరామప్రసాద్, కొయ్యలమూడి సురేంద్ర, యలమాటి చినరామరావు, మొగల్పు లక్ష్మణరావు,కరుటూరి శ్రీనివాస్ పాల్గొన్నారు.


పల్లంట్ల శివాలయంలో వనసమారాధన

ఆంజనేయరాజు జయంతి


ఆంజనేయరాజు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

ఉండ్రాజవరం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పౌరాణిక నాటక చక్రవర్తి, ప్రముఖ రంగస్థల నటుడు షణ్ముఖి ఆంజనేయ రాజు జయంతిని ఆదివారం మండలంలోని పాలంగి గ్రామంలో నిర్వహించారు. ఆయన విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆంజనేయరాజు కుమారుడు రంగస్థల నటుడు షణ్ముఖి జయవిజయకుమార్‌రాజు మాట్లాడుతూ నాటక రంగానికి ఆయన లేని లోటు తీరలేనిదని పేర్కొన్నారు. నాటకరంగం ఉన్నంతకాలం ఆయన పేరు చిరస్థాయిగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఆంజనేయరాజు కుటుంబసభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

వ్యాన్ ఢీకొని యువకుడి మృతి

మరొకరికి తీవ్ర గాయాలు

చాగల్లు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బ్రాహ్మణగూడెంలో మెయిన్ రోడ్డుపై జరిగిన ప్రమాదంలో తొర్లపాటి అచ్చిబాబు(33) మృతిచెందాడు. ఎస్ఐ కె.నరేంద్ర ఆదివారం తెలిపిన వివరాల ప్రకారం.. ఊనగట్లకు చెందిన అచ్చిబాబు, తొర్లపాటి కొండయ్య నిడదవోలు నుంచి బైక్‌పై స్వగ్రామానికి తిరిగి వస్తుండగా ఎదురుగా వస్తున్న వ్యాన్ బలంగా ఢీకొట్టింది. తీవ్రంగా గాయాలైన వారిద్దరినీ వైద్యం కోసం నిడదవోలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ అచ్చిబాబు ఆదివారం మృతిచెందాడు. కాగా అచ్చిబాబుకు భార్య, ఇద్దరు కుమార్తెలు. వెల్డింగ్ పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు.

పీజీ స్పాట్ అడ్మిషన్ల గడువు పొడిగించండి

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): పీజీ స్పాట్ అడ్మిషన్ల గడువు పొడిగించాలని రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు ముళ్ళ మాధవ్, ఉపాధ్యక్షుడు యస్‌యస్‌ఆర్ భార్గవ, కార్యదర్శి గద్దే సుధాకర్ కోరారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. గత నెల 26 నుంచి 29వ తేదీ వరకు మాత్రమే పీజీ సెట్ 2024 వెబ్‌సైట్‌లు ద్వారా దరఖాస్తుచేసుకునే విధంగా అవకాశం ఇచ్చినా సాంకేతిక సమస్యల వల్ల పనిచేయలేదన్నారు. 28న నుంచి మాత్రమే వెబ్‌సైట్ పనిచేసిందన్నారు. దీంతో చాలామంది దరఖాస్తులు చేసుకోలేకపోయారన్నారు. గడువు పొడిగించకపోతే విద్యార్థులు నష్టపోతారని స్పష్టంచేశారు. ఒకవారం రోజులు పీజీ స్పాట్ అడ్మిషన్ల దరఖాస్తు గడువు పొడిగించాల రాష్ట్ర విద్యాశాఖ మంత్రి లోకేశ్‌కు విజ్ఞప్తి చేస్తున్నామన్నారు.

దేశం దృష్టిని ఆకర్షిస్తున్న కూటమి పథకాలు

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజాసంక్షేమ పథకాలు దేశం దృష్టిని ఆకర్షిస్తున్నాయని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. జగన్ అంతటి ఆర్థిక నేరగాడు మరొకడు లేడన్నారు. రాష్ట్రాన్ని గాడిలో పెట్టగరలనే నమ్మకంతోనే చంద్రబాబుకు పట్టం కట్టారన్నారు. నిరుపేదలకు ఎన్‌టీఆర్ భరోసా పింఛన్లు సమర్థవంతంగా అందిస్తున్నామన్నారు.

గోపిమూర్తికి మొదటి ప్రాధాన్య ఓటు వేయాలి

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీడీఎఫ్ అభ్యర్థి బొర్రా గోపిమూర్తికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని ఏపీటీఎఫ్ (1938) జిల్లా కార్యవర్గం పిలుపునిచ్చింది. స్థానిక నెహ్రూ నగర్ మునిసిపల్ పాఠశాలలో ఆదివారం జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. సమావేశంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

దుబాయ్‌లో పేరవరం వాసి అనుమానాస్పద మృతి

- పది రోజుల క్రితమే మృతి
- మంత్రులు లోకేశ్, నిమ్మల సహకారంతో నేడు స్వగ్రామానికి మృతదేహం
- కన్నీరుమున్నీరవుతున్న బంధువులు


రమేష్(ఫైల్)

ఆత్రేయపురం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): జీవనోపాధి కోసం దుబాయ్ వెళ్లిన ఓ యువకుడు అనుమానాస్పదంగా మృతిచెందాడు. పదిరోజులు కావొస్తున్నా మృతదేహం ఇంటికి రాకపోవడంతో ఆ కుటుంబ సభ్యులు వేదన చెందుతున్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం పేరవరం గ్రామానికి చెందిన అంగర రమేష్ (35) దుబాయ్‌లోని డేరా ప్రాంతంలోని ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేసేవాడు. ఏడాదిన్నర క్రితం వెళ్లి ఉద్యోగంలో చేరినా మధ్యలో స్వగ్రామం వచ్చి 6 నెలల క్రితమే తిరిగి వెళ్లాడు. రమేష్‌కు భార్య కవితాదేవి, ఇద్దరు కుమారులు ఉన్నారు. అక్కడ పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు.ఇదిలా ఉండగా గత నెల 15న అనుమానాస్పదంగా మృతిచెందాడు. అక్కడ మిత్రులు కుటుంబీకులకు సమాచారం అందించారు. అయితే మృతదేహాన్ని స్వగ్రామానికి పంపించడంలో జాప్యం జరుగుతోంది. రమేష్ మృతిపై అక్కడ ప్రభుత్వం విచారణలో తేల్చాల్సి ఉంది. ఈ నేపథ్యంలో రమేష్ భార్య కవిత బంధువులు ఈ విషయాన్ని రాష్ట్ర మంత్రి నిమ్మల రామానాయుడు దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే మంత్రి లోకేశ్‌కు విషయాన్ని వివరించారు. అక్కడ ప్రతినిధులతో మాట్లాడి మృతదేహాన్ని స్వగ్రామానికి రప్పించే చర్యలు వేగవంతం చేశారు. దుబాయ్ నుంచి విమానంలో మృతదేహాన్ని గన్నవరం ఎయిర్‌పోర్టుకు వచ్చే ఏర్పాట్లు చేపట్టారు. సోమవారం గన్నవరం ఎయిర్‌పోర్టు నుంచి మృతదేహాన్ని స్వగ్రామం తీసుకొస్తున్నట్టు సమాచారం. రమేష్ మృతితో పేరవరంలో విషాదఛాయలు అలుముకున్నాయి. బంధు మిత్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఉల్లంఘన!

- అక్రమాలకు పాల్పడిన రంపచోడవరం గిరిజన సంక్షేమ ఇన్‌చార్జి డీడీ
- ఉన్నతాధికారులకు తెలియకుండా 14 మంది సిబ్బందికి డిప్యూటేషన్లు
- ఎన్నికల సంఘం, ఉన్నతాధికారులకు ఆదివాసీ సంఘం ఫిర్యాదులు

రంపచోడవరం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉండగా రంపచోడవరంలోని గిరిజన సంక్షేమ ఇన్‌చార్జి డీడీ ఒకరు అక్రమాలకు పాల్పడి 14 మంది సిబ్బందిని డిప్యుటేషన్లపై బదిలీ చేస్తూ వివాదస్పద ఉత్తర్వులు జారీ చేశారు. ఈ బాగోతాన్ని ఆదివాసీ ఉద్యోగుల సంక్షేమ సాంస్కృతిక సంఘం వెలుగులోకి తెచ్చి ఎన్నికల సంఘానికి, జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తూ ఆ సమాచారాన్ని మీడియాకు తెలిపారు. ఈ బాగోతం పూర్వాపరాలు ఇలా ఉన్నాయి. గిరిజన సంక్షేమ డిప్యూటీ డైరెక్టర్ కార్యాలయం రంపచోడవరం ఐటీడీఏ కార్యాలయానికి అనుబంధంగా నడుస్తోంది. ఈ డిప్యూటీ డైరెక్టర్ పోస్టు గత కొన్నేళ్లుగా ఇన్‌చార్జిలతోనే నడుస్తోంది. ఇటీవల ఈ పోస్టుకు వేరే అధికారిని ఇన్‌చార్జిగా నియమించారు. సదరు అధికారి రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి, చింతూరు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి నుంచి ఎటువంటి ఆమోదాలు తీసుకోకుండానే ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉండగానే తన కార్యాలయం నుంచి డిప్యుటేషన్లపై బదిలీలు చేపట్టారు. ఈ వ్యవహారంలో పెద్ద ఎత్తున ముడుపులు ఆయా అధికారులకు, కార్యాలయం సిబ్బందికి ముట్టాయని ఆదివాసీ సాంస్కృతిక సంఘం నాయకులు కత్తుల ఆదిరెడ్డి, తాడే రాజబాబు ఆరోపించారు. తక్షణం సదరు అధికారిని డీడీ బాధ్యతల నుంచి తప్పించాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా ఎన్నికల సంఘం, ఎన్నికల ఉన్నతాధికారులు అధికారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.